ప్రతి నిత్యం తాజా సమాచారంతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక



ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి

Publisher&Editor: 9391690609,Office :7893003409

aksharamtsnews@gmail.com https//www.facebook.com/aksharamnewspaper/

www.aksharamtelugudaily.com

సుఖం అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

బుధవారం 12 జూన్ 2024 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా

పేజీలు : 12 సంపుటి : 07 సంచిక : 83 వెల : రూ.3/- కొత్తగూడెం తెలంగాణ


CIRCULATED BY : ADILABAB,, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన నైరుతి..



# విద్యుత్ కొనుగోలుపై కేసీఆర్‌కు నోటీసులు

- ఈ నెల 15 లోపు విచారణకు హాజరు కావాలి
- డీల్ లో మీ పాత్ర ఏంటో చెప్పండి
- జస్టిస్ నరసింహ రెడ్డి కమిషన్ ఆదేశాలు
- ఛత్తీస్‌గఢ్ నుండి విద్యుత్ కొనుగోలు
- 1000 మెగావాట్ల కొన్నట్లు డీల్
- అప్పటి నుండి బీఆర్ఎస్ పై విమర్శలు
- విచారణ చేస్తాం అని అప్పట్లోనే అన్న కాంగ్రెస్
- లోటుపట్లు తెల్చే పనిలో కమిషన్
- త్వరలో మరికొంత మందికి నోటీసులు





హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు పవన్ కమిషన్ నోటీసులు ఇచ్చింది. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోళ్లపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ నెల 15 లోపు విద్యుత్ ఒప్పందంలో కేసీఆర్ పాత్రపై వివరణ ఇవ్వాలని జస్టిస్ నరసింహారెడ్డి నోటీసులు పంపారు. అయితే జులై 30 వరకు సమయం ఇవ్వాలని కేసీఆర్ కమిషన్ ను కోరారు. తెలంగాణలో విద్యుత్ కొనుగోలు అంశం తీవ్ర చర్చనీయాంశం అవుతుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే విద్యుత్ కొనుగోళ్ల అంశంపై విచారణకు ఆదేశించింది. దీనిపై విచారణకు జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ను నియమించింది. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ ఒప్పందాలపై లోటుపాట్లు తేల్చాలని కమిషన్ ను ఆదేశించింది. దీంతో జస్టి నరసింహారెడ్డి... మాజీ సీఎం కేసీఆర్ కు నోటీసులు ఇచ్చారు.

జస్టిస్ నరసింహారెడ్డి నేతృత్వంలోని కమిషన్ మాజీ సీఎం కేసీఆర్ పదవీకాలంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలలో తన ప్రమేయంపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. జూన్ 15లోగా సమాధానం ఇవ్వాలని కమిషన్ కోరింది. దీనిపై స్పందించిన కేసీఆర్ జులై 30 వరకు తనకు అదనపు సమయం కావాలని కోరుతూ లేఖ రాశారు. యాదాద్రి, దామరచర్ల విద్యుత్ ప్లాంట్లకు సంబంధించిన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కమిషన్ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పీపీఏలలో జరిగిన అవకతవకలపై దర్యాప్తు ముమ్మరం చేసింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ప్రతిపాదనపై కూడా విచారణ జరుగుతోంది.

**త్వరలో అధికారులకు నోటీసులు**

ఈ మేరకు సోమవారం తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో మాజీ ఛైర్మన్,

మిగితాది 2లో...



## రవాణా శాఖ లో చట్టానికి లోబడి రెవెన్యూ పెంచేందుకు చర్యలు తీసుకోండి



- స్కూల్ బస్సుల ఫిట్నెస్ పై తనిఖీలు నిర్వహించాలి
- ఎన్ ఫోర్స్ మెంట్ ను బలోపేతం చేసి చెక్ పోస్టుల వద్ద నిరంతర నిఘా ఉంచాలి
- రోడ్డు భద్రత పై అవగాహన కల్పించాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన రవాణా శాఖ ఉన్నతాధికారులతో సచివాలయంలో కాన్ఫరెన్స్ హల్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారులు, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్లు, ఆర్టీవో లు తదితర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా చట్టానికి లోబడి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రెవెన్యూ పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యల పై అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశా నిర్దేశం చేశారు.. త్రైమాసిక టాక్స్ వసూలుకు సంబంధించి తక్కువగా నమోదు చేసిన వివిధ జిల్లాల అధికారులకు తమ పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. 100 శాతం పన్ను వసూలు చేసిన జిల్లా అధికారులను అభినందించారు. సమావేశానికి రాని

మిగితాది 2లో...

## ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్

- ప్రభాకర్ రావు, శ్రవణ్ కుమార్‌కు రెడ్ కార్నర్ నోటీసులు
- వీళ్లిద్దరూ తప్పించుకుని తిరుగుతున్నట్టు పోలీసుల వెల్లడి
- ముందస్తు ప్లాన్ ప్రకారమే విదేశాలకు
- మొదట లుక్ ఔట్ నోటీసులు.. తర్వాత బ్లూకార్నర్ నోటీసులు



2లో..

## త్వరలోనే అందరికీ కొత్త రేషన్ కార్డులు

తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు జారీపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. త్వరలోనే అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటన చేశారు. రేషన్ కార్డుతో ఆరోగ్యశ్రీ, పింఛన్, ఫీజు రీయింబర్స్మెంట్, ఇతర ప్రభుత్వ పథకాలు ముడిపడి ఉన్నాయి. దీంతో కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో రేషన్ కార్డుల జారీపై కీలక నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మూడు నెలల తర్వాత రేషన్ షాపుల్లో సన్నబియ్యం

మిగితాది 2లో...



- ఆరోగ్యశ్రీ, పింఛన్‌కు రేషన్ కార్డు ముడి
- రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం
- కసరత్తు చేస్తున్న అధికారులు
- ఎన్నికల హామీ నెరవేర్చేందుకు కసరత్తు
- సామాన్యులకు ఆదా కానున్న డబ్బులు
- అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇస్తామన్న మంత్రులు

## 24 నుంచి పార్లమెంట్ సమావేశాలు

- 22న పూర్తి స్థాయి బడ్జెట్
- 24, 25వ తేదీల్లో ఎంపీల ప్రమాణం
- 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక



2లో..

## బాడ్ టైం!




## మంత్రులకు 'ల్యాండ్ క్రూయిజర్'

- కేసీఆర్ విజయవాడలో దాచిపెట్టినవే..
- ఇప్పటి దాకా సీఎంకే ల్యాండ్ క్రూయిజర్ కార్లు
- ఇక మంత్రులకు సమకూర్చుతున్న ప్రభుత్వం
- స్పష్టం చేసిన ప్రొటోకాల్ డిపార్ట్‌మెంట్




హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్‌లోని మంత్రులందరికీ ఖరీదైన ల్యాండ్ క్రూయిజర్ కార్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఒక్కో మంత్రికి ఒక్కో

మిగితాది 2లో...

## సిద్దిపేట స్విమ్మింగ్ పూల్ లో పడి బాలుడు మృతి

- బాలుడిది సిద్దిపేట పట్టణం లింగారెడ్డిపల్లి
- బాసర ట్రిపుల్ ఐటీలో విద్యాభ్యాసం
- సెలవుల్లో ఇంటికొచ్చిన గిరీష్
- లోతుగా ఉన్న పూల్‌లో దూకడంతో మృతి

6లో..



## సింగరేణికి గుడ్ న్యూస్

- కారుణ్య నియామక వయోపరిమితి పెంపు
- 48 ఏండ్లకు పెంచుతున్నట్టు ప్రకటన
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 2018, మార్చి 9 కటాఫ్ తేదీగా నిర్ణయం

300 మంది నిరుద్యోగులకు వెంటనే లబ్ధి

2లో..



సింగరేణి కారుణ్య నియామక ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వారసుల గరిష్ట వయో పరిమితి 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్



**జ్యోతి నగర్ జూన్ 11 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్**

పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన తీన్మార్ మల్లన్న హైదరాబాద్ ముఖ్యమంత్రి కార్యాలయంలో రాష్ట్ర మంత్రులతో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ ను కలిశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ,ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణు గోపాల్ రావు , ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ , భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కు శాలువా కప్పి సత్కరించారు.

# బి.ఆర్.ఎస్ నాయకులకు మాజీ ఉప ముఖ్యమంత్రి పరామర్శ



హనుమకొండ/భీమదేవరపల్లి/జూన్ 11(అక్షరం న్యూస్):

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ నాయకులు కండె చక్రపాణి, కండె స్వామి తండ్రి కండె రాజయ్య అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. ఈ మేరకు మంగళవారం మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రాజయ్య మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బిఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ మాట్ల వెంకటస్వామి, బి.ఆర్.ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ కండె రమేష్, కండె సుధాకర్, కండె సంజీవ్, గిన్నారపు కుమారస్వామి, వేముల జగదీష్, గజ్జల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## యాక్సిడెంట్ బాధితుడికి ఆర్థికసాయం




**రాజన్న సిరిసిల్ల/వేములవాడ, జూన్ - 11 (అక్షరం న్యూస్):**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండల పరిధి కోనాయిపెల్లి గ్రామానికి చెందిన ఏరెల్లి సాయి కుమార్ గత పది రోజుల క్రితం రోడ్ యాక్సిడెంట్ లో గాయపడి ఆసుపత్రిలో చేరిన సాయిని చూసి డాక్టర్ సీరియస్ అని చెప్పడంతో మన చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు చిన్ననాటి బాల్య మిత్రుడి కొడుకు కావడంతో అపెక్స్ ఆసుపత్రిలో ఆపరేషన్ ఉన్న కారణంగా మన చారిటబుల్ ట్రస్ట్ నుండి 33,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.

# వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం..

ఖమ్మం/ వైరా జూన్ 11 (అక్షరంన్యూస్)

గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు ఉంద్రు వరలక్ష్మి ఆధ్వర్యంలో వైరా బ్రాహ్మణ పల్లికి చెందిన గంట హరితకు నర్సింగ్ థర్డ్ ఇయర్ కాలేజీ ఫీజు కోసం పదిహేను వేల రూపాయలను లయన్ డాక్టర్ కాపా మురళి కృష్ణ ఉంద్రు వరలక్ష్మి ఉంద్రు శ్యామ్ బాబు ఆర్థిక సాయం తో అందించారు. కార్యక్రమం లో రిజియన్ చైర్ మెన్ లగడపాటి ప్రభాకర్ మాట్లాడు తూ ఇప్పటివరకు అనేక మంది పేద విద్యార్థులకు కాలేజీ ఫీజుల నిమిత్త%శీ% ఆర్థిక సాయం అందించామని తెలిపారు ఈ కార్యక్రమంలో జిఎంటి కోఆర్డినేటర్ ఉంద్రు శ్యాంబాబు కిషన్ రాయి మరికంటి గోపాల్ ఉయ్యూరు రామకృష్ణ పాల్గొన్నారు.




## ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ చొరవతో త్వరలోనే 35 కోట్ల రూపాయలతో రామగుండంలో బీసీ సంక్షేమ భవనం ఏర్పాటు

బీసీ సంక్షేమ మాత్యులు శ్రీ పొన్నం ప్రభాకర్



**జ్యోతి నగర్ జూన్ 11 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్**

మంగళవారం రోజున సెక్రటేరియట్ లో రామగుండం శాసనసభ్యులు మక్కాన్సింగ్ రాష్ట్ర మంత్రి పొన్న ప్రభాకర్ కలిసి వినతి పత్రం సమర్పించారు. గోదావరిఖని బస్టాండ్ ఆధునికరించి షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా బీసీ సంక్షేమ భవన నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రెండు హామీలను నెరవేరుస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. కరీంనగర్ రీజియన్ పరిధిలోని ఆదాయంలో ప్రతి ఏటా లాభాలు అందించే లిగోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్లి గతంలో నిర్మించినది కావడంతో బస్టాండు కూడా శిథిలావస్థకు చేరువ కావస్తున్న సందర్భంలో లినేటి జనాభాకు అనుగుణంగా ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేందుకై గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్ ని మోడల్ బస్టాండు వలె అధునీకరించాలనిలి ప్రస్తుతం పెరిగిన ప్రయాణికుల రద్దీకి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యవంతంగా ఉంటుందని అలాగే గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్ నుండి గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని సర్వీసులను నడిపించాలని విజ్ఞప్తి చేశారు.

## మోడల్ స్కూల్ ఫలితాలలో ప్రథమ స్థానాలలో నిలిచిన గాంధీ పార్క్ విద్యార్థులు







**జ్యోతి నగర్ జూన్ 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

అంతర్గాం మండలం లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలలో స్థానిక గాంధీ నగర్ లోని గాంధీ పార్క్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తొలి మూడు స్థానాలతో పాటు అత్యధిక సీట్లు కైవసం చేసుకున్నారు. పాఠశాల విద్యార్థిని టి.లిల్లీ 86 మార్కులతో ప్రథమ స్థానం, 84 మార్కులతో కే.రాహుల్ ద్వితీయ స్థానం, 77 మార్కులతో టి.లాస్య సుగుణ తృతీయ స్థానం సాధించడంతోపాటు పాఠశాల నుండి మొత్తం 21 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మండల విద్యాధికారి ఏ.రాజయ్య, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్.ఇజ్రాయిల్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మూడెత్తుల లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు చెరుకూరి స్వరూప్ చంద్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## సిపిఐ ఎంఎల్ కేంద్ర కమిటీ సభ్యురాలు చంద్ర పుల్లారెడ్డి సహచరి నిర్మల అక్కకు శ్రద్ధాంజలి

**జ్యోతి నగర్ జూన్ 11 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్**

సిపిఐ (ఎమ్ ఎల్ )కేంద్రకమిటి సభ్యురాలు,చంద్ర పుల్లారెడ్డి సహచరి,కామ్రేడ్ రాధాక్క అలియాస్ నిర్మలక్క మంగళవారం అమరురాలు అయినది. కామ్రేడ్ నిర్మలక్క కు తెలంగాణ రైతుకూలీ పోరాటసమితి టి ఆర్ పి కే ఎస్ విప్లవ జోహార్లు అర్పిస్తుంది. గోదావరిలోయ ఆదివాసీ ప్రజలతో రాధాక్కకువిడదీయరాని బంధం ఉన్నది. ములుగు అడవుల్లో కామ్రేడ్ సీపీ రెడ్డి తో కలిసి పోరాటల్లో పాల్గొన్నది. కామ్రేడ్ రాధాక్క స్ఫూర్తితో కామ్రేడ్ పూలక్క, జయక్క, చంద్రక్క, లక్ష్మక్క లు సాయుధ పోరాటల్లోకి వచ్చారు. కామ్రేడ్ రాధాక్క మరణం గోదావరిలోయ ప్రతిఘాట నోద్యమాలకు తీరని లోటు. కామ్రేడ్ రాధాక్క అమరత్వాన్ని ఎత్తిపడుతూ నేడు దేశంలో రాష్ట్రంలో పెరుగుతున్న పిడిత ప్రజా వ్యతిరేక చర్యలను ఒడిద్దాం. అమరుల ఆశయల సాధనాలో మునుముందుకే సాగుతాం అంటూ తెలంగాణ రైతుకూలీ పోరాట సమితిప్రకటిస్తుంది. కామ్రేడ్ రాధాక్క కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుందనీ తెలంగాణ రైతుకూలీ పోరాట సమితి పెద్దపల్లి జిల్లా కన్వీనర్ వెలుతురు సదానందం తెలిపారు.




## ఎన్నికల హామీలను అమలు చేయాలి...

కౌలు రైతులకు రైతు బరోసా ఇవ్వాలి..

సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు.

సిపిఎం వైరా పట్టణ సభ్యుల రాజకీయ క్లాసులు ప్రారంభం....




**ఖమ్మం/ వైరా జూన్ 11 (అక్షరంన్యూస్)**

సిపిఐ(ఎం) వైరా పట్టణ పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణా తరగతులు స్థానిక మదు విద్యాలయంలో జరుగుతున్నవి. మంగళవారం జరిగిన రాజకీయ క్లాసులకు పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు చింతనిప్పు చలపతిరావు ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. ఉదయం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు వర్తమాన రాజకీయాలు బోధించారు. నేడు అధికారం దక్కించుకొనే విధంగా దేశ రాజకీయాలు ఉన్నాయని, అధికారం కోసం ప్రజాసమస్యలు గాలికి వదిలేశారని, ఎన్నికలో గెలుపు కోసం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. భారత వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టివేయ బడుతుందని, వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పెరుగుతున్న వేడి వలన వ్యవసాయ పంటల దిగుబడులు తగ్గిపోతున్నాయని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు చట్టబద్ధత కల్పించాలని అన్నారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు వేంటనే ఎన్నికలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. మధ్యాహ్నం మతం-మతోన్మాదం క్లాసు వైరా స్టడీ సర్కిల్ కన్వీనర్

బోడపట్ల రవీందర్ బోధించారు. బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య మత విద్వేషాలను పెంచుతుందని, లౌకిక రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని అన్నారు. ఈ క్లాసుల్లో పార్టీ వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, మల్లెంపాటి రామారావు, బొంతు సమత, హరి వేంకటయ్య, అనుమోలు రామారావు, రాచబంటి బత్తిరన్న, సంక్రాంతి నరసయ్య, గుడిమెట్ల మోహన్ రావు, గుమ్మా నరసింహారావు, శాఖా కార్యదర్శులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

## సాంబరాజు రవికి ఘన నివాళులర్పించిన టీఆర్ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు



**జఫర్ గడ్,జూన్11, అక్షరంన్యూస్ :**

జనగామ జిల్లా జఫర్గఢ్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు ఏదునూరి నరేష్ అధ్వర్యంలో మంగళవారం తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి మాజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కీ.శే సాంబరాజు రవి ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు.భౌతికంగా వారు మా మధ్యన లేకున్నా రజక జాతికి చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ అశోక్, సూరారం మాజీ సర్పంచ్ మేడిపల్లి శ్రీనివాస్,చిట్యాల ఐలమ్మ మనుమలు చిట్యాల రామచంద్రం,సంపత్, సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు రాపర్తి సోమన్న,నేషనల్ ధోబీ రిజర్వేషన్ సంఘ జాతీయ ఉపాధ్యక్షులు ఉల్లెంగల యాదగిరి,తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక,రాష్ట్ర ఉపాధ్యక్షులు సాంబరాజు కుమార్,మిన్నలపురం జలేంధర్,రాష్ట్రసంయుక్త కార్యదర్శి ఏదునూరి వీరన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దీకొండ రాజు, కళామండలి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యామంకి యుగేందర్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉల్లెంగుల యాదగిరి మాజీ సర్పంచ్,జిల్లా సీనియర్ నాయకులు ఉల్లెంగుల రాములు,జిల్లా గౌరవ అధ్యక్షులు రాపర్తి యాకన్న, జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిపాక రాములు, జిల్లా కార్యదర్శి ఉల్లంగుల రాజు,జిల్లా సంయుక్త కార్యదర్శి ఉల్లెంగుల చంద్రశేఖర్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడాల రాజు, జిల్లా ప్రచార కార్యదర్శి కొన్నె ఉపేందర్,జిల్లా ముఖ్య సలహాదారు మెంతన కిష్టయ్య,దర్శనాల లక్ష్మణ్ మరియు కుటుంబ సభ్యులు బంధుమిత్రులు రాజకీయ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..



**ఖమ్మం/వైరా జూన్ 11 (అక్షరంన్యూస్)**

వైరా:- మండల పరిధిలోని పులిగుండ్ల లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద మంగళవారం పాలడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులుఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పదవ తరగతి పూర్తి చేసుకుని 23 వసంతాలు పూర్తవడంతో ఒక్కసారిగా కలుసుకున్న వారు

ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను,చిలిపి చేష్టలను గుర్తు చేసుకుని ఎంతో సరదాగా గడిపారు.పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంతో పులిగుట్ట దేవాలయ పరిసరాలన్ని సందడిగా మారాయి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చిన్నతనంలో విద్యనభ్యసించిన పాఠశాలను అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. చిన్నతనంలో తమతో పాటు చదువుకుని ప్రస్తుతం ఈ లోకంలో లేనటువంటి విద్యార్థులకు నివాళులు అర్పించారు. అనంతరం ఒకరికొకరు గిఫ్ట్ ప్యాకెట్స్ అందించుకొని,విందులో పాల్గొన్నారు.గద్దల లక్షాద్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మోదుగు వినోద్ కుమార్, నాగేశ్వరరావు,పర్వీన్, శ్రీవాణి, కృష్ణవేణి, వెంకట్రావు, రవి, శైలజ, కుష్మావతీ,కవిత, తోట నరసింహారావు,తెనాలి నరసింహారావు, కిరణ్, నాగమణి, మజీద్, సురేష్, లక్ష్మి, కృష్ణయ్య, కృష్ణవేణి,అలీమ తదితరులు పాల్గొన్నారు.

# మసక బారుతున్న ప్రభుత్వ విద్య..

**ప్రభుత్వ పాఠశాలను ఆధునికరించాలి**
**కనీస మౌలిక సదుపాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి**
**యుద్ధ ప్రాతిపదన ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి**
**విద్యార్థులు బడిబాట పట్టాలంటే సమస్యలే పరిష్కారమే మార్గం.. ఏఐఎస్ఎఫ్**



**ఖమ్మం/ తల్లాడ జూన్ 11 (అక్షరంన్యూస్)**

ప్రభుత్వ విద్య మసకబారుతుందని,ఒకప్పుడు వందలాది మంది విద్యార్థులతో ఒక వెలుగు వెలిగిన ప్రభుత్వ పాఠశాలలు నేడు వెలవెలబోతున్నాయని, విద్యార్థులు బడిబాట పట్టాలంటే సమస్యల పరిష్కారమే మార్గమని అఖిల భారత విద్యార్థి సమాఖ్య( ఏఐఎస్ఎఫ్ ) జిల్లా కార్యదర్శి ఇటికల రామకృష్ణ అన్నారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ప్రతినిధి బృందం నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్

జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన మండపడ్డారు.
ప్రభుత్వ విద్య నిర్వీర్యం అయితే ప్రజలు తీవ్ర ఇబ్బందులుకు గురికావాల్సి వస్తుందని, ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులలో నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఆర్భాటంగా ఫ్లెక్సీ పెట్టి, ఫోటో దిగి, బడిబాడ ప్రచారాన్ని నిర్వహిస్తే విద్యార్థుల ప్రభుత్వ పాఠశాలలకు రారని రామకృష్ణ పేర్కొన్నారు.
గత పదేళ్లుగా ఉపాధ్యాయుల నియామకాలు లేకపోవడం, ప్రైవేట్ విద్యాసంస్థలను నియంత్రించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించి, ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ విద్యపై దృష్టి సారించి ప్రభుత్వ విద్య వ్యవస్థను ప్రతిష్టం చేయాలని అయన గత ప్రభుత్వం ఏదైతే విద్యార్థి వ్యతిరేక విధానాల అవలంబించిందో ఈ ప్రభుత్వం కూడా విద్యార్థి వ్యతిరేక విధానాల్ని అనుసరిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు కొత్తగా ఏరుపడినటువంటి ప్రభుత్వం వల్ల విద్య రంగానికి ఒరిగిందేమీ లేదని ఆయన విమర్శించారు ప్రభుత్వం కొలువుదీరి 2 వందల రోజులు గడుస్తున్నప్పటికీ కనీసం విద్యారంగానికి విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం అంత్యంత బాధాకరమని ఆయన అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం , ప్రభుత్వ





విద్య రంగంపై సారించి ప్రభుత్వ పాఠశాలను ఆధునికరించాలి అని ప్రభుత్వాన్ని కోరారు లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శివ, వంశీ, హరికృష్ణ. బాలాజీ మనోజ్ అయ్యప్ప ప్రసాద్ నవీన్ సాయి నరేష్ గోపి ప్రతాప్ వెంకటేష్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు...

## కమిట్మెంట్తో పని చేయండి...

ప్రజల మన్నలను పొందండి...
ట్రైనీ ఐఏఎస్ అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు





**ఖమ్మం/తల్లాడ జూన్ 11 (అక్షరంన్యూస్)**
కమిట్మెంట్ తో పనిచేసి ప్రజల మన్నలను పొందాలని శిక్షణలో ఉన్న 2023 బ్యాచ్ కి చెందిన ఐఏఎస్ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు హిత బోధ చేశారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ని మర్యాద పూర్వకంగా 2023 బ్యాచ్ ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారులు కలిశారు. డైరెక్టర్ జనరల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టు స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ శశాంక్ గోయల్ ఐఏఎస్, ట్రైనీ ఐఏఎస్ అధికారులను డిప్యూటీ సీఎం భట్టి కి పరిచయం చేశారు. శిక్షణలో ఉన్న అధికారులకు కేటాయించిన జిల్లాలు, గత ఎన్నికల్లో వారు నిర్వహించిన విధుల గురించి డిప్యూటీ సీఎంకు ఆయన వివరించారు. భగవంతుడు ప్రజలకు చేసేందుకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకోవడం వల్లనే చేసే ఉద్యోగానికి సంతృప్తి దొరుకుతుందని డిప్యూటీ సీఎం
వారితో అన్నారు. శిక్షణలో ఉన్న సమయంలో క్షేత్రస్థాయిలోకి వెళ్లి లోతుగా అధ్యయనం చేయడం వల్ల ప్రజల సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం తెలుసుకున్న అంశాలను పరిగణలోకి తీసుకొని పరిపాలనలో తీసుకునే నిర్ణయాల వల్ల ప్రజా సమస్యలు పరిష్కరించడం సులువు అవుతుందన్నారు. భౌగోళికంగా, వాతావరణం విషయంలో తెలంగాణ రాష్ట్రం చాలా బాగుంటుంది అని, ప్రజల సహకారం కూడా మంచిగా లభిస్తుందన్నారు. శిక్షణ కాలంలో
ట్రైనీ ఐఏఎస్ అధికారులు నిర్వహించిన విధులు, వారు చేసిన అధ్యయనం గురించి డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో
డిప్యూటీ సీఎం సెక్రటరీ కృష్ణ భాస్కర్ ఐఏఎస్, కోర్సు డైరెక్టర్ డాక్టర్ ఉషారాణి, నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ పెద్ద బోయిన, తదితరులు ఉన్నారు.

## నూట ఒక్క కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్న టీడీపీ రాష్ట్ర నాయకుడు



**జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ), జూన్ 11:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అఖండ విజయం సాధించిన సందర్భంగా జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రంలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర నాయకుడు ఎనికె రాజు మంగళవారం నూట ఒక్క కొబ్బరికాయలు కొట్టి మె క్కు చెల్లించుకున్నారు. గతంలో వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో నారా చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టును నిరసిస్తూ, ఎస్ కే రాజు రఘునాథపల్లి మండలం నుండి 7 అక్టోబరు 2023న రాజమండ్రి వరకు సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ సం దర్భంగా మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో ఏపీ రాష్ట్రంలో టీడీపీ విజయం సాధిస్తే నూట ఒక్క కొబ్బరికాయలు కొడుతానని ఆయన మొక్కుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొక్క రాంచంద్రయ్య, ఎడ్ల మల్లేష్, ఉవ గోని నర్సయ్య, ఎండి.జహంగీర్, దశరథ, గండికోట యాదగిరి, మాల మల్లేషం, మరాఠి వీరస్వామి, కొంగరి నర్సింగ రావు, మల్కాపురం యాకయ్య తదితరులు పాల్గొన్నారు

## ఖమ్మంలో రెండు రోజులు డిప్యూటి సీఎం భట్టి పర్యటన...

**తుమ్మల, పొంగులేటితో కలిసి సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష...**
**12న పాఠశాలల పుణ ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ..**
**మధిర నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన...**
**13న సీతరామ ప్రాజెక్టు పనుల పరిశీలన...**

ఖమ్మం/ తల్లాడ జూన్ 11 (అక్షరంన్యూస్)



డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క మల్లు ఖమ్మంలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ నెల 12, 13న మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి సాగునీటి ప్రాజెక్టుల పనుల పరిశీలన, అధికారులతో సమీక్షతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పాలనపై ప్రత్యేక దృష్టి సారించిన డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క మల్లు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ఫోకస్ పెట్టారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన సీతరామ ప్రాజెక్టును పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు సాగు నీరు ఇవ్వాలన్న సంకల్పంతో ఇప్పటికే సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డితో కలిసి పలు మార్లు రాష్ట్ర సచివాలయంలో సమీక్షలు నిర్వహించారు.
కాగా వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి ప్రాజెక్టును ఈ నెల 13న మంత్రులతో కలిసి సందర్శిస్తారు. అధికారులు కాగితాల్లో చూపించిన పురోగతి, వాస్తవ స్థితిని పరిశీలించిన అనంతరం అక్కడే అధికారులతో సమీక్ష నిర్వహించి త్వరితగతిన ప్రాజెక్టు పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి దశ దిశ నిర్దేశం చేయనున్నారు. పట్టువదలని విక్రమార్కుడిగా ఇందిరా, రాజీవ్ సాగర్ (సీతరామ) ప్రాజెక్టులను పూర్తి చేయడానికి భట్టి చాల పట్టుదలతో ముందుకు సాగుతున్న నేపథ్యంలో అధికారులు సైతం ఇందుకు తగ్గట్టుగా మంత్రుల పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేశారు.

పర్యటన సాగుతుందీలా%ా
%రెండు రోజుల పాటు డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు ఖమ్మం ఉమ్మడి జిల్లాలో ఇలా పర్యటిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల పుణ ప్రారంభం సందర్భంగా బుధవారం ఉదయం 10 గంటలకు ఖమ్మం ఎన్ ఎస్ పి క్యాంపు ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేయనున్నారు. ఆతరువాత ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, విద్య, సంక్షేమ పథకాల అమలు తీరుపై అధికారులతో శాఖల వారీగా సమీక్ష చేస్తారు. మధ్యాహ్నం 3 30 గంటలకు మధిర నియోజకవర్గం చింతకాని మండలం వందనం-పుట్టకోట, పాతర్లపాడు- గోవిందపురం గ్రామాల మధ్యన పంచాయతీరాజ్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఈ నెల 13న ఖమ్మం నుంచి ఉదయం 8.30 గంటలకు సీతరామ ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరుతారు. ఉదయం 10గంటలకు దుమ్ముగూడెంకు చేరుకొని సీతరామ ప్రాజెక్టు పనులను పరిశీలిస్తారు. సీతరామ ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్ రెగ్యూలేటర్, ఆశ్వారావుపేట మండలం బిజి కొత్తూర్లోని పంప్ హౌజ్, కెనాల్, ముల్కలపల్లి మండలం పంప్ హౌజ్-2, కమలపురం మండలం పూసుగూడెం లోని పంప్ హౌజ్-3, కెనాల్స్ పనులను పరిశీలిస్తారు. అలాగే కమలపురం వయా పాల్వంచ, కొత్తగూడెం, జూలూరుపాడు మీదుగా ఎన్కూర్ లింక్ కెనాల్ పనులను తనిఖీ చేయనున్నారు.

## సింగరేణి సంస్థలో వయోపరిమితి పెంపు సంబరాల్లో కార్మిక నేతలు

**వయోపరిమితి పెంపు వల్ల వేలాదిమంది కార్మికుల పిల్లల లబ్ధి పొందే అవకాశం**
**కార్మికుల హక్కుల సాధనలో ఐఎన్టియుసి యూనియన్ ముందుంటుంది**




**భద్రాద్రి జిల్లా/ కొత్తగూడెం /జూన్.11 /అక్షరం న్యూస్**
సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల్లో వయోపరిమితిని 35 సం" 40 సం" పెంపు వల్ల కార్మికుల పిల్లలకు ఎంతో ప్రయోజనమని ఐఎన్టియుసి నేతలు హర్షం వ్యక్తం చేశారు. కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ లోని ఐఎన్టీయూసీ కార్యాలయం నందు ఐఎన్టియుసి నాయకుల ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ సింగరేణి సంస్థలోని ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా వయోపరిమితి 35 సం నుండి 40 సం లకు పెంపు కోసం డిమాండ్ చేయడం జరిగింది, కారుణ్య నియమాకాల్లో కార్మికులు వయోపరిమితి పెంచాలని ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కార్మికుల పిల్లలకు వయోపరిమితి పెంచడం వల్ల చాలామందికి ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చనే ఉద్దేశంతో ఐఎన్టియుసి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ వయోపరిమితి పెంపు సమస్యను ఎన్నోసార్లు యాజమాన్యంతో మాట్లాడడం జరిగిందని, అలాగే కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంతో ఎన్నో దఫాలు చర్చలు జరిపి ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాల వయోపరిమితి పెంచడంలో వారు ఎంతో కృషి చేయడం జరిగిందని, దీనివల్ల వేలాదిమంది కార్మికుల పిల్లల లబ్ధి పొందే అవకాశం ఉందని, భవిష్యత్తులో ఐఎన్టియుసి యూనియన్ ద్వారా ఇంకా ఎన్నో హక్కులను సాధించే అవకాశం ఉందని,ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, నాయకులు,కార్యకర్తలు, స్వీట్స్ పంచడం జరిగింది .ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ త్యాగరాజు, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పితాంబరం, సీనియర్ నాయకులు ఆల్బర్ట్, అభిషేక్, మహేష్ ఫిట్ కార్యదర్శులు గోపు కుమార్ స్వామి,చిలక రాజయ్య,ఎం.డి సత్తార్ పాష,ఈ.మోహన్ రెడ్డి,శనగరపు కుమార్, కే నట్రాజ్, శంకర్ బాబు సిహెచ్ సంగారావు ( సాగర్), కోటేశ్వరరావు, ఎం కొమురయ్య, నాగిరెడ్డి, సెక్రటరీ జెలి కిరణ్, సంపత్, రెడ్డి,పాష, తదితరులు పాల్గొన్నారు.

## రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

**మృతుడు మంచిర్యాల జిల్లా వాసి**



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ), జూన్ 11: మంచిర్యాల జిల్లాకు చెందిన యువకుడు జనగామ జిల్లా రఘునాథపల్లి-యశ్వంతపూర్ రైల్వే స్టేషన్ల మధ్య గల నిడిగొండ వద్ద గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మంచిర్యాల జిల్లా నత్మూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన సుర రవికుమార్ (31) అనే యువకుడు హైదరాబాదు లో ని ఒక ప్రైవేటు సంస్థలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన రవికుమార్ గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలంలో టిఎస్ 08 జే 4203 అక్టివ ద్విచక్ర వాహనం, ప్లాస్టిక్ వాటర్ బాటిల్ ఉంది. అక్టివ ద్విచక్ర వాహనం నెంబరు ఆధారంగానే మృతునిడివివరాలు తెలిశాయని జీఆర్పి కానిస్టేబుల్ నరేష్ తెలిపారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు. చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పి హెడ్ కానిస్టేబుల్ ఆర్.రమణా రెడ్డి తెలిపారు

## విస్తృతంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు..

**ఖమ్మం/ తల్లాడ జూన్ 11( అక్షరంన్యూస్)**
తల్లాడ మండల వైద్య అధికారి రత్న మనోహర్ పర్యవేక్షణలో తల్లాడ మండలంలోని వివిధ గ్రామాలలో డి వాటరింగ్, శానిటేషన్ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య సిబ్బంది వివిధ సూచనలు చేశారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందువల్ల ఇంటి పరిసరాలలోని ఖాళీ సీసాలు ప్లాస్టిక్ డబ్బాలు కొబ్బరి బోండాలు టైర్లు వాడని నీటితోట్లు మొదలైన వాటిల్లో వర్షపు నీరు చారటంవల్ల డెంగ్యూ వ్యాధిని ప్రజల పరిచే దోమల యొక్క వృద్ధి పెరిగి ప్రజలకు జ్వరాల బారిన పడే అవకాశం ఉన్నది మన ఇంటి పరిసరాలలో
గల నీటితోట్లు కొబ్బరి బోండాలు పాత జాడీలు సీసాలు టైర్లు మొదలైనవి ఇంటి పరిసరాలలో లేకుండా చూసుకోవాలి అని సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్స్ మోహన్, పెద్ద పుల్లయ్య, భద్రమ్మ, వసంతకుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## నాయి బ్రాహ్మణుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకి ఘన సన్మానం..

**ఖమ్మం/ వైరా జూన్ 11 (అక్షరంన్యూస్)**
వైరా నియోజవర్గ నాయి బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనములో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, నాయి బ్రాహ్మణ రాష్ట్ర అధ్యక్షులు గజ్జల వెంకన్న, ముఖ్యఅతిథిగా
హాజరయ్యారు. వారికి సమావేశ అనంతరం కొణిజర్ల నాయి బ్రాహ్మణ సంగీలు ఎమ్మెల్యేకి శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల మండల నాయి బ్రాహ్మణ అధ్యక్షులు కొలిపాక వెంకటేశ్వర్లు, నాయి బ్రాహ్మణ కొణిజర్ల గ్రామ అధ్యక్షులు కొలిపాక వీరబాబు , కొణిజర్లనాయి బ్రాహ్మణ ముఖ్య సలహాదారుడు%ఽకొణిజర్ల మండల కాంగ్రెస్ నాయకులు గుడివాడ వెంకటేశ్వర్లు, కుదురుపాక రమేష్, బెజవాడ రాంబాబు, బెజవాడ మణికంఠ, బెజవాడ నాగరాజు, అద్దంకి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



## పరుచూరి మురళి తల్లి మృతికి మంత్రి పొంగులేటి నివాళులు..



ఖమ్మం/ తల్లాడ జూన్ 11 (అక్షరంన్యూస్)
ఖమ్మం : సీనియర్ కాంగ్రెస్ నాయకులు పరుచూరి మురళి తల్లి మృతి చెందడం పట్ల తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి విచారం వ్యక్తం చేశారు. నగరంలోని బైపాస్ రోడ్డులో గల వారి నివాసంలో ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ణి ప్రార్థించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, రాష్ట్ర విద్యాసంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయబాబు, కార్పొరేటర్ దొడ్డా నగేష్, మిక్కిలినేని నరేంద్ర, కొప్పెర ఉపేందర్, కొడాలి గోవిందరావు, బాణాల లక్ష్మణ్, బోడా శ్రావణ్, షేక్ ఇమామ్, ఉమ్మినేని కృష్ణ, కాంపాటి వెంకన్న తదితరులు ఉన్నారు.

## వివాహం లో ఫోన్ లో ఫోటో తీయనందుకు వీడియో, ఫోటో గ్రాఫర్ పై దాడికి నిరసన ..

**వివాహం కి వచ్చిన వారు తమ ఫోన్‌లో ఫోటో తీయమంటే ఫోటోగ్రాఫర్ ఫోటో తీయనందుకు ఫోటోగ్రాఫర్ పై దాడి**



చొప్పదండి /కరీంనగర్, జూన్ 11 (అక్షరం న్యూస్)

శుభకార్యంలో సెల్ ఫోన్ లో ఫోటో తీయనందుకు ఫోటోగ్రాఫర్ పై భౌతిక దాడిని నిరసిస్తూ చొప్పదండి మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఫోటో స్టూడియోలను బందు పాటించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బోడిగే అజయ్ కుమార్ మాట్లాడుతూ శుభకార్యాల్లో కుటుంబ సభ్యులను, బంధువులను ఫోటోలు తీస్తూ బిజీగా ఉండే ఫోటోగ్రాఫర్ ని తమను సెల్ ఫోన్ లో ఫోటో తీయాలని అడిగి తీయకపోవడంతో ఫోటోగ్రాఫర్ ని భౌతికంగా దాడి చేయడం దారుణమని అన్నారు ఫోటోగ్రాఫర్ పై భౌతిక దాడి చేసిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి సామల కిషోర్, ప్రధాన కార్యదర్శి తెలికుంట వేణు ,మాజీ అధ్యక్షులు సిరిపురం శ్రీనివాస్, తాటి పెల్లి శివ, సభ్యుడు పెద్ది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటలకు టాటా.. బడికి బాట

**నేటి నుంచి బడులు ప్రారంభం**



రాజన్న సిరిసిల్ల/ జిల్లా స్టాపర్/ జూన్ 11 (అక్షరం న్యూస్): నేటి నుండి బడులు ప్రారంభం అవుతున్నాయి గత 50 రోజుల నుండి వేసవి సెలవులు రావడంతో విద్యార్థులు ఆటలకు టాటా చెప్పి బడుల బాటా పడుతున్నారు. వేసవి సెలవులలో ఆడుతూ పాడుతూ అమ్మమ్మలు పెద్దమ్మలు చిన్నమ్మల ఊరులకు పిల్లలు వెళ్లి కాలక్షేపం చేశారు. మరియు కుటుంబ సమేతంగా తీత్రయాత్రలు చల్లని ప్రదేశాలు పర్యాటక కేంద్రాలకు వెళ్లి ఎంజాయ్ చేశారు.

## నాణ్యతలేని రోడ్డు నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి





ఓదెల/ పెద్దపల్లి జూన్ 11 (అక్షరం న్యూస్)

ఓదెల గ్రామం నుండి కొలనూరు వరకు కోట్లాది రూపాయలు పెట్టి నిర్మిస్తున్న తార్ రోడ్డు మోటార్ సైకిల్ స్టాండ్ వేస్తేనే కుంగిపోతుందని రోడ్డు వేసిన కొద్ది రోజులకే ఎక్కడికక్కడ పగిలిపోవడం జరిగిందని కొన్నిచోట్ల కిందికి కృంగిపోవడం కూడా జరుగుతుందని నాణ్యత లేకుండా నిర్మించిన గుత్తేదారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇస్తున్నట్లు శంకరయ్య తెలిపారు వెంటనే తారు రోడ్డును పరిశీలన చేసి సంబంధిత కాంట్రాక్టర్ పై తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కానుగంటి శంకరయ్య మీడియాతో మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్న తార్ రోడ్డును జి ఎస్ ఆర్ కంపెనీ నిర్మాణం తన ఇష్టాన్ని రీతిగా ఎలాంటి నాణ్యత పాటించకుండా వేస్తున్నారని కొన్ని దిక్కుల కల్వర్టు కింద కాంక్రీట్ తోటి బెడ్ వేయకనే నిర్మాణం చేపట్టారని అదేవిధంగా కాంక్రీట్ పై సరియైనటువంటి రోలింగ్ చేయకపోవడం వల్లే ఇలాంటి కృంగిపోవడం జరుగుతుందని దీనికి పర్యవేక్షణ అధికారి లేక కాంట్రాక్టర్ తన ఇష్టం వచ్చిన రీతిలో నిర్మాణం చేపట్టడం జరిగిందని అంతా నా ఇష్టం అనే రీతిలో నిర్మాణం నాసిరేఖంగా నిర్మించడం వల్లే రోడ్డు పూర్తిగా పగిలిపోయి శిధిలమవుతుందని చిన్న వర్షానికి ఇలాంటి పరిస్థితి ఎదురైతే రేపు పెద్ద వర్షాలకు రోడ్డు ఎలా ఉంటుందో అర్థమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు వెంటనే కాంట్రాక్టు పై చర్యలు తీసుకొని నాణ్యమైన రోడ్డు నిర్మాణం వేయించాలని ఓదెల మండల ప్రజలు రైతులు కోరడం జరిగిందని శంకరయ్య అన్నారు వెంటనే కలెక్టర్ స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# మైనారిటీ కోటాలో షబ్బీర్ అలీ కు మంత్రి పదవి ఇవ్వాలి : రాష్ట్ర ముస్లిం వర్గస్థులు

మద్నూర్ /జులై 11 (అక్షరం న్యూస్ - కామారెడ్డి )

తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గంలో ముస్లిం మైనారిటీలకు ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర మైనారిటీ వర్గస్థులు కోర్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టబోయే మంత్రి వర్గ విస్తరణలో మైనారిటీకి వర్గానికి చోటు కల్పించి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కొరకు కృషి చేయాలనీ కోర్తున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన మాజీ మంత్రి ఇప్పటి ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ కు మంత్రి వర్గంలో ప్రాధాన్యత కల్పించి మైనారిటీ అభివృద్ధి, సంక్షేమం కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి వహించాలని కోర్తున్నారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ రాష్ట్ర రాజకీయాలలో సీనియర్ నాయకుడిగా ఉండి కాంగ్రెస్ పార్టీ బలోపేతం కొరకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ కామారెడ్డి నియోజక వర్గం నుండి పోటీ పడగా రేవంత్ రెడ్డి కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేయడం జరిగింది. ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొరకు కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ సిటు వదులుకొని త్యాగం చేసి పక్కకు ఉన్నటువంటి నిజామాబాదు నుండి పోటీలో నిల్చోవడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ లో ముస్లిం అభ్యర్థులు గెలువక పోవడం తో మొదటి మంత్రి వర్గ విస్తరణలో మైనారిటీ నాయకునికి అవకాశం కల్పించక పోవడం గమనార్హం . కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా ముస్లిం వర్గస్థులకు అండగా మైనారిటీ సంక్షేమానికి పాటు పడే షబ్బీర్ అలీ కు కాంగ్రెస్ పార్టీ హైకామాండ్ దృష్టి సారించాలని కోరడం జరుగుతుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు షబ్బీర్ అలీ కు అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రాధాన్యత కలిగిన విద్యుత్ శాఖ మరియు మైనారిటీ సంక్షేమ మంత్రిగా బాధ్యతలు అప్పగించడం జరిగింది. షబ్బీర్ అలీ హయాంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ముస్లిం మైనారిటీ వర్గస్థులకు విద్యాలయాలు, స్కాలర్షిప్ లు , విద్యా ఉద్యోగాలలో 4 % రిజర్వేషన్లు కల్పించి మైనారిటీ వర్గస్థులకు పెద్ద పీఠ వేయడం జరిగిందని తెలిపారు. 4 % రిజర్వేషన్ తో ముస్లిం పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ఉన్నత చదువులు, ఉద్యోగాలలో స్థిరపడటం జరిగిన విషయాన్నీ తెలియజేయడం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర ముస్లిం వర్గస్థులు మంత్రి వర్గంలో షబ్బీర్ అలికి చోటు కల్పించి వక్ బోర్డు ఆస్తులు, భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని కోర్తున్నారు. గత బి. ఆర్. ఎస్. ప్రభుత్వ హయాంలో వక్ బోర్డు ఆస్తులు పూర్తి స్థాయిగా అన్యాక్రాంతం కావడం జరిగిందని తెలిపారు. అన్యాక్రాంతం అయినా వక్ బోర్డు ఆస్తులపై విచారణ కమిటీ వేసి వక్ బోర్డు ఆస్తులు పరిరక్షించాలని కోర్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని నియోజక వర్గాలలో ముస్లిం ఓట్లు, జనాభా అధికంగా ఉండటంతో కాంగ్రెస్ పార్టీకి ముస్లిం మైనారిటీలు పూర్తి స్థాయిగా మద్దతు తెలుపడం జరుగుతుంది. దేశ రాజకీయాలలో కానీ రాష్ట్ర రాజకీయాలలో కాంగ్రెస్ పార్టీకి ముస్లిం వర్గస్థులు మద్దతుతో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావడం కొరకు పూర్తి స్థాయి మద్దతు



పలుకుతున్న విషయాన్నీ హైకామాండ్ మరియు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదిష్టణం అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పించి మంత్రి వర్గం విస్తరణ చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ముస్లిం వర్గస్థులు కోర్తున్నారు. రాష్ట్రంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ కు హైదరాబాద్ పట్టణంలో ముస్లిం మైనారిటీ నాయకులతో మంచి సంబంధాలు ఉండటం తో కాంగ్రెస్ పార్టీకి స్థానిక జి. యం. సి. మున్సిపల్, గ్రామ స్థాయి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కు కొండంత బలోపేతం కాంగ్రెస్ పార్టీకి కలుగడం జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీకి ముస్లిం వర్గస్థులు ఎన్నికల్లో అధిక ప్రాధాన్యత కల్పించి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లో భాగస్వామ్యం అయినా విషయాన్నీ తెలిపారు. మొన్న జరిగిన పార్లమెంట్ (యం. పి ) ఎన్నికల్లో నూటికి నూరు శాతం ముస్లిం వర్గస్థులు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి వారి విజయంలో భాగస్వామ్యం కావడం జరిగింది. షబ్బీర్ అలీ కు మంత్రి వర్గంలో చోటు కల్పించుతేయ్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం వర్గస్థులు కంచుకోటగా ఏర్పడటం ఖాయం అని తెలుస్తుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ గత 10 సంవత్సరాల కాలంలో ముస్లిం మైనారిటీలకు మంత్రి పదవి ఇవ్వకుండా ముస్లింలకు మోసం చేసి వక్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కావడం జరిగిందని ముస్లిం వర్గస్థుల యొక్క అభిప్రాయం, రాష్ట్రం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయట్టబోయే మంత్రి వర్గంలో ముస్లిం వర్గానికి చెందిన రాష్ట్రం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి షబ్బీర్ అలీ కు మంత్రి వర్గంలో చోటు కల్పించి మైనారిటీ సంక్షేమ అభివృద్ధి కు తొడ్పాటు అందించాలని ముస్లిం వర్గస్థులు కోర్తున్నారు. ఉమ్మడి నిజామాబాదు జిల్లా నుండి ఒక్కరికి కూడా మంత్రి వర్గంలో చోటు కల్పించకపోవడం తో ఇప్పుడు చేయట్టబోయే మంత్రి వర్గంలో ఉమ్మడి నిజామాబాదు జిల్లాకు మొదటి ప్రాధాన్యత కల్పించి ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర అభివృద్ధి కొరకు ఆదిష్టణం మంత్రి వర్గానలో చోటు కల్పించాలని మైనారిటీ వర్గస్థులు కోర్తున్నారు.

# పాఠశాలలు సిద్ధమయ్యేనా?

- **అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పనులకు శ్రీకారం**
- **ఇతర సమస్యలతో నెమ్మదించిన పనులు**
- **మరి కొద్దిరోజుల్లో స్కూలు పున:ప్రారంభం**

ఓదెల/ పెద్దపల్లి జూన్ 10(అక్షరం న్యూస్)

ఓదెల మండల కేంద్రంలో 22 గ్రామాలకు గాను మొత్తం 34 పాఠశాలలు ఉన్నాయి అందులో మన ఊరు మనబడి ఎంపిక కాబడిన పాఠశాలలు మూడు పూర్తి కావడం జరిగింది అదేవిధంగా 31 పాఠశాలలు కస్తూర్బా పాఠశాలకు మోడల్ స్కూల్ కు నిధులు మంజూరు కాలేదు. అదేవిధంగా 11 పాఠశాలలకు అసంపూర్తిగా పనులు జరుగుతున్నాయి అదేవిధంగా 18 పాఠశాలలకు పనులు చివరి దశలో ఉన్నట్లు అధికారులు తెలిపారు ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఎన్నికల నేపథ్యంలో గతంలో పనిచేసిన మదర్ కమిటీలను ఎన్నికల కోడ్ ఉన్నందున రద్దు చేయడం జరిగింది అదేవిధంగ ఈ బాధ్యతలను పాఠశాల అభివృద్ధి కార్యక్రమం ఆగిపోతుందని తెలిసి స్వయం సహాయక గ్రూపుల సంఘాలకు అమ్మ ఆదర్శ కమిటీలుగా నామకరణ చేసి మహిళా సంఘాల అధ్యక్షురాలను అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలుగా తీసుకోవడం జరిగింది ఈ కమిటీలన్నీ ఏపిఎం. ఆధ్వర్యంలో పాఠశాలలో ఉన్న మౌలిక వసతులను నిర్మాణం చేయడం కోసం ప్రత్యేక నిధులు కేటాయించి మిగిలిన పనులను పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టింది ఈ నేపథ్యంలోనే ఈ పాఠశాలల పనులు జరుగుతున్నాయి అదేవిధంగా గతంలో పనులు పూర్తిగాక విద్యార్థులు కాలకృత్యాలకు బయటికి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది వాటి అన్నిటిని దృష్టిలో పెట్టుకొని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఏర్పాటు చేసి పనులు పూర్తి చేయాలని ఆలోచన చేసిన అధికారులు చకచక్యంగా పనులు నడిపిస్తున్నారు ఈ నేపథ్యంలో పాఠశాలలు పునర్ ప్రారంభానికి కొద్ది టైము ఉండడం వల్ల పనులు వేగవంతం చేయడం లేదని విమర్శలు ఉన్నాయి

వెంటనే అధికారులు చర్యలు తీసుకొని పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు ప్రజలు కోరుతున్నారు అదేవిధంగా విద్యార్థుల వసతుల కోసం



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఏటా కొత్త విద్యాసంవత్సరం ప్రారంభంలో ఉచితంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందిస్తోంది. ప్రయివేట్ కంటే ఎన్నో రెట్లు నిపుణులైన ఉపాధ్యాయుల ద్వారా పాఠాలు చెప్పిస్తోంది. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పెట్టిస్తోంది. కానీ సర్కారు బడులకు తమ పిల్లలను పంపిద్దామనుకుంటే వాటిల్లో కనీస వసతుల్లేక నిత్యం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి ఉంది. ఫలితంగా పేద కుటుంబాలు అప్పులు చేసి మరి తమ పిల్లలను ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లలో చదివిపించేం దుకు తహతహ లాడు తున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు గత ప్రభుత్వం మన ఊరు %-% మన బడి, మన బస్తీ-మన బడి అనే కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సర్కార్ బడుల్లో మూడేండ్ల వ్యవధిలో దశలవారీగా తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టింది. సకాలంలో నిధులు విడుదలవ్వక.. మొదటిదశలో చేపట్టాల్సిన పాఠశాలల్లో చాలావరకు పనులు కాలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా కొలువైన కాంగ్రెస్ ప్రభుత్వం సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పన కోసం అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా అవసరమైన అభివృద్ధి, మరమ్మతులకు శ్రీకారం చుట్టింది. పాఠశాలలను అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారు. వీటిలో ఈ విద్యాసంవత్సరం మొత్తం 384 పాఠశాలల్లో వివిధ రకాల మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. ప్రధానంగా తాగునీటి సౌకర్యం, విద్యుత్, టాయిలెట్స్, బాలికల అదనపు టాయిలెట్లు, మరమ్మతులు, పెయింటింగ్‌తో పాటు బెంచీలు, డ్యూయల్ డెస్క్, గ్రీన్‌బోర్డులు వంటివి ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం కోట్లు మంజూరు చేసింది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఈ నిధులు విడుదల చేశారు. ఉదాహరణకు తాగునీటి సౌకర్యం కోసం రూ.లక్ష, మరమ్మతులకు రూ.2లక్షలు, విద్యుత్ సౌకర్యం కోసం ప్రతి తరగతి గదికీ రూ.25వేలు, టాయిలెట్స్ రిపేరింగ్ కోసం రూ.35వేలు, బాలికల కోసం అదనపు టాయిలెట్లకు రూ.లక్ష నుంచి రూ.3లక్షల చొప్పున కేటాయించారు. సదరు నిధులను ఇప్పటికే అమ్మ ఆదర్శ కమిటీలకు సంబంధించిన బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. పనులు పూర్తవగానే ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎల్‌ఎఫ్ చైర్మెన్ సంతకంతో డబ్బులు డ్రా చేసి చెల్లించే అవకాశం కల్పించారు.

# జిల్లాలో 3.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- రూ.726.84 కోట్ల ధాన్యం కొనుగోలు
- రైతుల ఖాతాల్లోకి రూ.681.25 కోట్లు
- ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి
- జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్



పెద్దపల్లి ప్రతినిధి జూన్ 11 అక్షరం న్యూస్

పెద్దపల్లి జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని ఇప్పటివరకు 3.31 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ డిఎం ముప్పిడి శ్రీకాంత్ పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ డిఎం వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి అక్షరం ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. పెద్దపల్లి జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో 61, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 217 చొప్పున మొత్తం 311 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.


**311 కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు... రైతుల ఖాతాలోకి 94% డబ్బులు జమ**

ఈ రబీ సీజన్లో మూడు లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకోగా, లక్ష్యానికి మించి కొనుగోలు చేసినట్టు జిల్లా మేనేజర్ పేర్కొన్నారు.క్వింటాల్ ఏ గ్రేడ్ రకం వరి ధాన్యానికి 2203 రూపాయలు, కామన్ రకం వరి ధాన్యానికి 2113 రూపాయలు ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందని ఆయన తెలిపారు.జిల్లాలో ధాన్యం కొనుగోలు కోసం 133 మిల్లులను ఎంపిక చేసినట్టు ఆయన వివరించారు.ఇప్పటి వరకు జిల్లాలో 52219 మంది రైతుల నుండి 726.84 కోట్ల రూపాయల విలువైన 3.32 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన వరి ధాన్యానికి సంబంధించి ఇప్పటివరకు 681.25 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన వివరించారు. ఇప్పటివరకు 94% డబ్బులు రైతుల ఖాతాలో జమ చేసినట్టు ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసినందుకు అధికారులు సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## కారు బీభత్సానికి తల్లికొడుకులకు స్వల్పగాయాలు

- నిందితుడు మైనర్‌గా గుర్తించిన పోలీసులు
- కారు యజమాని పైన మైనర్ బాలుని తల్లిదండ్రుల పైన కేసు నమోదు చేశాము : సి.ఐ హరికృష్ణారెడ్డి



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 11/ అక్షరం న్యూస్ :

కారు బీభత్సం సృష్టించిన ఘటనలో తల్లి కొడుకులకు గాయాలు కాగా, మరో 20 వాహనాలు ధ్వంసమైన సంఘటన నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపిర వివరాల ప్రకారం మణికొండ పుప్పాల్‌గూడ గోల్డెన్ టెంపుల్ వద్ద మంగళవారం ఉదయం కారు బీభత్సం సృష్టించింది. వేగంగా వస్తున్న బలెనో కారు(టీఎస్09 ఎఫ్‌సీ 8171) ఒక్కసారిగా అదుపుతప్పి గుడి పక్కనే పార్క్ చేసిన బైక్‌లపై నుంచి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో దాదాపు 20 బైక్‌ల వరకు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఈ ఘటనలో ఓ మహిళ, ఆమె కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో అక్కడి నుంచి డ్రైవర్ పరార్ అయ్యేందుకు ప్రయత్నించగా కాలనీవాసులు వెంబడించి పట్టుకున్నారు. అనంతరం వారి సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న నార్సింగి పోలీసులు కారును, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమిక విచారణలో భాగంగా కారును నడిపిన వ్యక్తిని పోలీసులు మైనర్‌గా గుర్తించినట్లు తెలుస్తుంది. మైనర్ పిల్లలకి, లైసెన్స్ లేని వారికి వాహనాలు నడుపుటకి ఇవ్వకూడదని పోలీసులు సూచిస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మెరుగైన విద్యా బోధనతో పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు





**జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్**

ఖమ్మం /తల్లాడ జూన్ 11( అక్షరంన్యూస్)

ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మెరుగైన విద్యా బోధనతో పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ స్థానిక రమణ గుట్టలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికారులు, ఉపాధ్యాయులు, పిల్లలచే ర్యాలీగా, విద్య ప్రాముఖ్యత, ప్రతిఒక్కరు చదువుకోవాలనే నినాదాలతో ర్యాలీ కొనసాగింది. జిల్లా కలెక్టర్ ఇంటింటికి తిరుగుతూ, ఇంట్లో చదువుకొనే పిల్లలు ఉన్నది, ఏ పాఠశాలలో చదువుతున్నది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యా ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని వారి పిల్లలను తప్పనిసరిగా చదివించాలని తెలిపారు. ప్రతి ఒక్క పిల్లవాడు పాఠశాలలో నమోదయ్యే దిశగా బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం జూన్ 6 నుంచి జూన్ 19 వరకు నిర్వహిస్తుందని ఆయన అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన వసతులు, ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో వస్తున్న మెరుగైన ఫలితాలను తల్లిదండ్రులకు వివరిస్తూ అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు అయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు కంటే మెరుగైన నాణ్యత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు చెబుతారని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల యొక్క సంపూర్ణ అభివృద్ధిపై దృష్టి పెట్టడం జరుగుతుందని, బట్టిపట్టే విధానం కాకుండా పాఠ్యాంశాలు విద్యార్థులకు అర్థమయ్యే దిశగా వారికి వివరిస్తూ కొత్త బోధనా పద్ధతులను ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని, దీని ఫలితంగా ఇటీవలే వచ్చిన పదవ తరగతి ఫలితాల్లో జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో



విద్యార్థులు ఉత్తీర్ణత పెరిగిందని, ప్రైవేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలను సాధిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో ఎటువంటి ఖర్చు లేకుండా నాణ్యమైన విద్య, విద్యార్థులకు అందుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో రెగ్యులర్ గా ప్రతి నెల పేరెంట్, టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామని, విద్యార్థుల పురోగతే లక్ష్యంగా ఎప్పటి కప్పుడు తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు విఫలమైన చంద్రయాన్ ప్రయోగాన్ని మన భారత శాస్త్రవేత్తలు విజయవంతం చేశారని, అటువంటి శాస్త్రవేత్తలు సైతం ప్రభుత్వ పాఠశాలలోనే చదివారని, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య ఉచితంగా అందించడంతో పాటు వారికి అవసరమైన యూనిఫామ్, పాఠ్య, నోట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చాలని, అనవసరంగా ప్రైవేటు పాఠశాలల్లో చేర్చి డబ్బు వృథా చేసుకోవద్దని, ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ఐఐటి, నీట్ ఫలితాల్లో మంచి ప్రదర్శన కనబరుస్తున్నారని, క్రీడా పోటీలలో సైతం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అధికంగా రాణిస్తున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకునే విధంగా తల్లిదండ్రులు వారి పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

అంతకుముందు కలెక్టర్ స్థానిక ఎన్ఎస్పి కాలనీ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను తనిఖీ చేశారు. పాఠశాలకు యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు వచ్చినది అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, క్రొత్తగా ఎంతమంది నమోదు అయ్యింది అడిగి తెలుసుకున్నారు. బడి బాట కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలుచేయాలని, డ్రాప్ అవుట్ అయిన పిల్లలను గుర్తించి, తిరిగి చదువుకునేలా చూడాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, ఖమ్మం అర్బన్ మండల విద్యాధికారి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు శంకర్రావు, పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.






## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద ఎత్తున విద్యార్థులను చేర్పించాలి..

- బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి..
- అధికారులను ఆదేశించిన..జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్

ఖమ్మం/ తల్లాడ జూన్ 11 (అక్షరంన్యూస్)

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వపాఠశాలల్లో పెద్ద ఎత్తున విద్యార్థులను చేర్పించాలని, బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో బడి బాట, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పూర్తిపై విద్యాశాఖ, ఇంజనీరింగ్, మండల సమాఖ్యలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ గ్రామాన బడిబాట కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి, బడీడు పిల్లలను గుర్తించి వారి వివరాలు సేకరించాలని అన్నారు. గుర్తించిన పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా కృషి చేయాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో 1 నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల కల్పన, ఇంగ్లీష్ మీడియం బోధనపై అవగాహన కల్పించి, వారిలో చైతన్యం తేవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతోనూ సమావేశం నిర్వహించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చదువుకొని అప్ గ్రేడ్ అవుతున్న ఐదు నుంచి ఆరు సంవత్సరాల వయసున్న చిన్నారు లందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనితో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ, విద్యా బోధన, పై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మంచి గుర్తింపు వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్డు, టాయిలెట్స్ మిగిలిన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అన్నారు. వారంలోగా పనులన్నీ పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మహిళా సంఘాలే పనులు చేపట్టాలని, నిధుల మంజూరు విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదని ఆయన తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు పాఠ్యపుస్తకాలు అందించడంతోపాటు యూనిఫామ్స్ విద్యాశాఖ అధికారులు సిద్ధం చేసి ఉంచాలని సూచించారు. పాఠశాలల్లో శానిటేషన్ సంబంధించిన పనులు చేపట్టాలని తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి సంబంధించి అన్ని వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువ ఉన్నచోట పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలను సైతం మరింత బలోపేతం చేయాలని సూచించారు. పాఠశాలల పునఃప్రారంభం రోజున పాఠశాలలను అరటి, మామిడి ఆకులతో అలంకరణ చేయాలని, పండుగ వాతావరణం స్ఫూరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాల ప్రవేశం, ఆవరణలో వీధిదీపాల ఏర్పాటుచేయాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ వీడియో సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ , జడ్పి సీఈఓ ఎస్. వినోద్, డీఆర్డీఓ ఆర్. సన్యాసయ్య, డిఐఇఓ రవిబాబు, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి, బి.సి. వెల్ఫేర్ అధికారి జ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ డి.డి. విజయలక్ష్మి, పంచాయతీరాజ్, మునిసిపల్, ఆర్ అండ్ బి ఇఇ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచలోని రెవిన్యూ భూ వివాదాలను పరిష్కరించాలి

- పాల్వంచలోని 444, 817, 999,727 సర్వే నెంబర్లలో రిజిస్ట్రేషన్ ను పునరుద్ధరణ చేయాలి
- మంత్రి పొంగులేటిని కలిసి వినతిపత్రం అందించిన డీసీఎంఎస్ చైర్మన్ : కొత్వాల



భద్రాద్రి జిల్లా /పాల్వంచ/ జూన్.11/ అక్షరం న్యూస్‌బీ పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచలోని రెవెన్యూ భూ వివాదల వలన పాల్వంచ వాసులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వాటిని తక్షణమే పరిష్కరించాలని డీసీఎంఎస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు మంత్రి పొంగులేటి ని కోరారు. మంగళవారం పాల్వంచలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల తో పాటు పాల్వంచ కాంగ్రెస్ నాయకులు మంత్రికి వినతి పత్రం సమర్పించారు. కొత్వాల మాట్లాడుతూ పాల్వంచలోని 444, 817, 999,727 సర్వే నెంబర్ లలో రిజిస్ట్రేషన్ లేక 2016 సం" నుండి క్రయ, విక్రయాలు నిలిచిపోయాయి, దీని వలన అనేక లావాదేవీలు నిలిచిపోయి పాల్వంచ వాసులు బెంబేలేత్తుతున్నారని కొత్వాల అన్నారు. వెంటనే స్పందించిన పొంగులేటి కొత్తగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ ప్రియంక అల తో చర్చించారు. త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పాల్వంచ వాసులకు ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ మాజీ జడ్పిటిసి యర్రంశెట్టి ముత్తయ్య, పాల్వంచ మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, నూకల రంగారావు, నాయకులు బాలినేని నాగేశ్వరరావు, మేదరిమెట్ల వెంకటేశ్వరరావు, వై. వెంకటేశ్వర్లు, పాబోలు నాగేశ్వరరావు, కందుకూరి రాము, పులి సత్యనారాయణ, పైడిపల్లి మహేష్, ఉండేటి శాంతివర్ధన్, బండి అంబేద్కర్, తుమ్మల శివారెడ్డి, కాపర్తి వెంకటాచారి, శిరసాని రమణ, వజ్జల రాము, వాసుమల్ల సుందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## డయాలసిస్ కేంద్రం ఏర్పాటు కు కృషి చేసిన ఎమ్మెల్యే కూనంనేని ను సన్మానించిన వైద్యులు



భద్రాద్రి జిల్లా/ పాల్వంచ/ జూన్.11/ అక్షరం న్యూస్‌బీ పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి ఐదు యూనిట్లతో కూడిన డయాలసిస్ కేంద్రం మంజూరు కృషి చేసి ఏర్పటుకు సహకరించిన కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ను వారి క్యాంప్ కార్యాలయంలో పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావు డాక్టర్ దొర కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# టిడిపిఎల్పీ నేతగా చంద్రబాబు ఏకగ్రీవ ఎన్నిక

**శాసనసభాపక్ష నేతగా బాబును ఎన్నుకున్న నేతలు**

**పవన్ కళ్యాణ్ ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదం**



అమరావతి,జూన్11 అక్షరం న్యూస్

టీడీఎల్పీ నేతగా అధినేత చంద్రబాబు నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అచ్చన్నాయుడు ప్రతిపాదనను ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం శాసనసభ పక్ష నేతగా చంద్రబాబు పేరును జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్‌లో కూటమి నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరి, కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అనంతరం చంద్రబాబును శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నట్లు.. గవర్నర్‌కు కూటమి పక్షాల నేతలు లేఖ ఇవ్వనున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు.. సాయంత్రానికల్లా చంద్రబాబును గవర్నర్ ఆహ్వానించనున్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో రాజధాని గ్రామాలలో సందడి వాతావరణం నెలకొంది. రాజధాని కోసం భూమిచ్చిన రైతులు దాదాపు ఐదేళ్ల పాటు తమ పోరాటాన్ని కొనసాగించారు. వైసీపీ ప్రభుత్వం కారణంగా నానా ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు ఏపీలో ఎన్డీఏ కూటమి ఘన విజయంతో రాజధాని గ్రామాల్లోని రైతులంతా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుం టున్నారు. బుధవారం చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నేపథ్యంలో రాజధాని గ్రామాల్లో ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. రాజధాని గ్రామ వాసులంతా ఎమ్మెల్యే , ఎంపీ అభ్యర్థులకు ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇంటింటికి తిరిగి స్వీట్ బాక్స్‌లు రాజధాని రైతులు పంపిణీ చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారంతో తిరిగి అమరావతికి పునర్జీవం వచ్చిందని చెబుతున్నారు. మొత్తానికి చంద్రబాబు రాకతో అమరావతికి మహర్దశ పట్టిందనే చెప్పాలి.

# గత ఐదేళ్లు విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నాం

- కష్టాల్లో ఉన్న ఎపిని గాడిలో పెట్టే బాధ్యత చంద్రబాబుదే
- బాబు అనుభవం ఎపి అభివృద్ధికి దోహదపడుతుంది
- కూటమి భేటీలో జనసేనాని పవన్ కళ్యాణ్ వెల్లడి



అమరావతి,జూన్11 అక్షరం న్యూస్

గత ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ విపత్కర పరిస్థితులు ఎదుర్కొందని జనసేనాని పవన్ కళ్యాణ్ అన్నారు. ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా చంద్రబాబు పేరును పవన్ ప్రతిపాదించారు. కష్టాల్లో ఉన్న ఏపీని గాడిన పెట్టేందుకు చంద్రబాబు లాంటి అనుభవజ్ఞుడైన నాయకుడు అవసరం అని చెప్పారు. అనంతరం చంద్రబాబును పవన్ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. విజయవాడ ఏ కన్వెన్షన్ హాలులో మంగళవారం ఎన్డీయే కూటమి ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. చంద్రబాబును ఎన్డీయే కూటమి శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ తీర్మానాన్ని గవర్నర్‌కు పంపనున్నారు. ఆయన ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం పంపనున్నారు. అనంతరం బుధవారం ఉదయం 11:27 గంటలకు ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తారు. ఎన్నికల్లో కూటమి అద్భుత మెజార్టీతో 164 అసెంబ్లీ స్థానాలు, 21 లోక్ సభ స్థానాలను దక్కించుకుందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ విజయం దేశం మొత్తానికి స్ఫూర్తినిచ్చిందని చెప్పారు. 'కూటమి ఎలా ఉండాలో అందరం కలిసికట్టుగా చూపించాం. కక్ష సాధింపులు, వ్యక్తిగత దూషణలకు సమయం కాదు. 5 కోట్ల మంది ప్రజలు మనందరిపై నమ్మకం పెట్టుకున్నారు. అభివృద్ధిని సమష్టిగా ముందుకు తీసుకెళ్లాలని పవన్ పిలుపునిచ్చారు. ఎన్నికల్లో తెదేపా, జనసేన, భాజపా కూటమి కలిసి కట్టుగా పోరాడి అద్భుత విజయాన్ని సొంతం చేసుకుందని చెప్పారు. కూటమి శాసన సభాపక్ష నేతగా చంద్రబాబు పేరును ప్రతిపాదించిన అనంతరం పవన్ మాట్లాడారు.

'తెదేపా, జనసేన, భాజపా ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు. అందరం కలిసికట్టుగా పోరాడి అద్భుతమైన మెజారిటీలతో గెలిచాం. 164 శాసనసభ స్థానాలు, 21 ఎంపీలను ఎన్డీయే కూటమి దక్కించుకుంది. అద్భుతమైన విజయం ఇది. కూటమి అంటే ఎలా ఉండాలో రాష్ట్ర ప్రజలు కలిసికట్టుగా చూపించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వం అని ఇప్పటం సభలో చెప్పాం..అదే మాటపై నిలబడ్డాం. ఒడుదొడుకులు ఎదుర్కొన్నాం.. తగ్గాం.. ప్రజల్లో నమ్మకాన్ని పెంచి అద్భుతమైన మెజారిటీతో ప్రభుత్వాన్ని స్థాపించ బోతున్నాం. కక్ష సాధింపులకు, వ్యక్తిగత దూషణలకు ఇది సమయం కాదు. మనందరం సమష్టిగా ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలి. సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, శాంతి భద్రతల విషయంలో బలంగా నిలబడతామని చెప్పాం. ఉమ్మడి మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సమయంలో సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడు కావాలి. నాలుగు దశాబ్దాల అనుభవం, అభివృద్ధిపై అపారమైన అవగాహన, పెట్టుబడులను తీసుకొచ్చే సమర్థత, ప్రతిభ, విదేశాల అధ్యక్షులను తెలుగు రాష్ట్రాల వైపు దృష్టి మళ్లించే శక్తి ఉన్న చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి చాలా అవసరం. ఆయన నలిగిపోయారు. జైల్లో చూశాను. అప్పుడు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పడిన బాధను చూశాను. మంచిరోజులు వస్తాయి.. కన్నీళ్లు పెట్టొద్దని చెప్పాను. ఆ రోజులు వచ్చాయి. చంద్రబాబుకు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు చెబుతున్నా.. అద్భుతమైన పాలన అందివ్వాలని కోరుకుంటున్నా అని చెప్పారు. ఈ సందర్భంగా పవన్‌ను చంద్రబాబు ఆలింగనం చేసుకుని ధన్యవాదాలు తెలిపారు.

## జర్నలిస్టుల ఇంటి స్థలం ,కొత్త అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలి

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని కలిసి వినతిపత్రం అందజేసిన టీజేఏఫ్ జిల్లా అధ్యక్షులు: కల్లోజి శ్రీనివాస్**



భద్రాద్రి జిల్లా/ పాల్వంచ/ జూన్.11/ అక్షరం న్యూస్‌బీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికి ఇంటి స్థలాల తో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని, కొత్త అక్రిడేషన్లు మంజూరు చేయాలని రాష్ట్ర సమాచార రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి టీజేఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కల్లోజి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది . ఈ కార్యక్రమంలో యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు చంద్ర నరసింహారావు, టెంజూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వట్టి కొండ రవి, సిహెచ్ నరసింహారావు, పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## నేడు పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల్లో మంత్రి పొంగులేటి పర్యటన..



ఖమ్మం/తల్లాడ జూన్ 11 (అక్షరంన్యూస్)

ఖమ్మం : తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల్లో బుధవారం పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా ఉదయం 06.30గంటలకు 59వ డివిజన్ దానవాయిగూడెంలో మున్నేరు ప్రొటెక్షన్ వాల్స్ పనులను సందర్శిస్తారని తెలిపారు. 10గంటలకు 60వ డివిజన్ రామన్నపేటలోని జెడ్పీహెచ్ఎస్ లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ లను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలోని ఐడీవోసీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో అభివృద్ధి పథకాలపై మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సమీక్షిస్తారని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఖమ్మం రూరల్ మండలంలోని దానవాయిగూడెం, రామన్నపేట, కామంచికల్, పాటివారిగూడెం, జాన్ బాద్ తండా , పడమటి తండా, దారేడు తదితర గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారని తెలిపారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై మంత్రి పొంగులేటి పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

## ఏఈవోలపై సస్పెన్షన్ ను వెంటనే ఎత్తివేయాలి..

**తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఏఈవోలు నిరసన...**





ఖమ్మం/ తల్లాడ జూన్ 11 (అక్షరంన్యూస్)

మహబూబాబాద్ జిల్లాలో జీలుగు విత్తనాల పంపిణీ లో అక్రమాలు జరిగాయని ముగ్గురు ఏఈఓ లను అకారణంగా సస్పెండ్ చేసిన కారణంగా మంగళవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి డివిజన్ ఏఈఓలు కొర్లగూడ రైతు వేదికలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సస్పెన్షన్ పై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏఈఓలపై ఉన్న సస్పెన్షన్ని వెంటనే ఎత్తి వేయాలని తిరిగి వారిని వీధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్దేశ్య పూర్వకంగా సస్పెండ్ చేసిన సంఘటనకు నిరసన తెలుపుతూ నిజమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా వినతి ని ఉన్నతాధికారులకు అందించాలని డివిజన్ అడిషనల్ వ్యవసాయ అధికారి నరసింహారావుకు వినతి అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓస్ జిల్లా అధ్యక్షుడు

షేక్ నాగుల్ మీరా, నరేష్, దీపక్ రెడ్డి, టీ.నరేష్, వెంకటేష్, ఆశాజ్యోతి, రీమా, హర్ష నందిని, నాగేశ్వరావు, గురుమూర్తి, నాగరాజు, సత్తుపల్లి డివిజన్ వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

# న్యాయవాది కుమార్తె శుభకార్యానికి హాజరైన ప్రముఖులు



మెదక్ బ్యూరో శివ్వంపేట జూన్ 11( అక్షరం న్యూస్)

శివ్వంపేట మండల కేంద్రానికి చెందిన హైకోర్టు న్యాయవాది వజ్జ హనుమంతు పల్లవి దంపతుల కుమార్తె శుభ కార్యక్రమం మేడ్చల్ శివారులోని శుభం వేదిక ఫంక్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా జరిగింది ఈ శుభ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు చిన్నారిని ఆశీర్వదించి వజ్జ హనుమంతు పల్లవి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు ఈ శుభ కార్యక్రమానికి హాజరైన వారిలో రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం పెద్ద గౌని శివకుమార్ గౌడ్ కె హెచ్ ఆర్ ట్రస్ట్ చైర్మన్ కల్లూరి కీర్తన హనుమంతరావు సీనియర్ జర్నలిస్టు ఇసుగారి మల్లేష్ శివంపేట మాజీ సర్పంచ్ పులిమామిడి స్రవంతి నవీన్ గుప్తా యువ న్యాయవాది వజ్జ సాయికుమార్ భాదే పెద్ద వెంకటేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద మునగాల గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పరికపల్లి శ్రీనివాస్



ఖమ్మం/ వైరా జూన్ 11 (అక్షరంన్యూస్)

కొనిజర్ల మండల పరిధిలోని పెద్ద మునగాల గ్రామ పంచాయితీ లో అనారోగ్యం తో బాధ పడుతున్న పలు కుటుంబాలను జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ పరికపల్లి శ్రీను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు.



ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజుల నుంచి అనారోగ్యం తో బాధ పడుతున్న బైరం కాంత రావు లింగాల జీవమ్మ బైరం నాగమ్మ మధు లను పరామర్శించి అధైర్య పడవద్దు అని అండగా ఉంటామని పదవి వున్న లేకున్నా ప్రజల్లోనే వుంటానని మీ కష్ట సుఖాలు చూస్కుంటనని సేవ చేయటంలోనే నాకు ఆనందం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బైరం బాలరాజు తలారి చిన్న గురవయ్య తలారి చందు గోపయ్య యేసొబు కోటయ్య రత్తయ్య నరేష్ మధు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ వేడుకల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి : రాజేంద్రనగర్ సర్కిల్ డీసీ రవికుమార్



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 11/ అక్షరం న్యూస్ : రానున్న బక్రీద్ వేడుకల్లో పారిశుద్ధ్యం పట్ల మున్సిపల్ సిబ్బంది అప్రమత్తతతో పని చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ అన్నారు. మంగళవారం ఈ మేరకు సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఎస్ఎఫ్ఏలు, ఎస్ ఎస్‌లు, డిప్యూటీ ఎస్‌డబ్ల్యూఎంలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో బక్రీద్ వేడుకల్లో వ్యర్థ పదారాలు ప్రధాన రహదారులు, కాలనీలు, బస్తీలలో పడేయకుండా చూసుకోవాలన్నారు. ఈ మేరకు మున్సిపల్ సిబ్బంది ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలోసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి బోనాలు



ఓదెల/పెద్దపల్లి జూన్ 11(అక్షరం న్యూస్) ఓదెల మండలంలోని నాంసాని పల్లి గ్రామంలో ముదిరాజ్ ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి బోనాల సందర్భంగా మంగళవారం ముందుగా పోచమ్మ తల్లి బోనాలు ఘనంగా సమర్పించారు ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఈరావేణ రాజు ముదిరాజ్ ఉపాధ్యక్షులు కందుల రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఇంటింటికి జోగు గ్రహించి అనంతరం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు బుధవారం పెద్దమ్మతల్లి బోనాల సందర్భంగా ముందుగా పోచమ్మను మొక్కుకోవడం అనవైతి ఈ సందర్భంగా భారీ ఎత్తున బోనాలు పోచమ్మ తల్లికి సమర్పించారు ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఈరవేణ రాజు ముదిరాజ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మృగశిరా మాసంలో ముదిరాజ్ కులాస్థల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి బోనాలు చేసుకోవడం జరుగుతుందని గ్రామంలో ప్రతి ఒక్కరు పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించి తల్లికి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని బుధవారం రోజున పెద్ద ఎత్తున బోనాలు తరలివెల్లి పెద్దమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకొని వారి దీవెనలు అందుకోవడం జరుగుతుందని అదేవిధంగా ముదిరాజ్ కులాస్తులనే కాకుండా అందరినీ సుభిక్షంగా చూసి వర్షాలు పాడి పంట పండి పిల్ల పాపతో కలకలాడే విధంగా చల్లని చూపు చూడాలని ఆ అమ్మవారిని మొక్కుకోవడం జరుగుతుందని బుధవారం జరిగే పెద్దమ్మతల్లి బోనాల కార్యక్రమానికి పెద్ద ఎత్తున నాయకులు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు ఈ నేపథ్యంలో పెద్దమ్మ తల్లి గుడికి గ్రామానికి చెందిన ముంజాల సదయ్య కుమారుడు వరుణ్ సీలింగ్ ఫ్యాన్ బహుకరించారు ఈ కార్యక్రమంలో కోశాధికారి వీరవైన పైడయ్య ముదిరాజ్ మాజీ ఉపసర్పంచ్ రమేష్ ముదిరాజ్ నేదురు రాజు ముదిరాజ్ నూనె రమేష్ ముదిరాజ్ మల్లేష్ ముదిరాజ్ సంజీవ్ కుమార్ ముదిరాజ్ శ్రీకాంత్ ముదిరాజ్ తో పాటు మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# నార్సింగి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.56.57 కోట్ల నిధుల కేటాయింపు

**ఆమోదించిన కౌన్సిల్ సభ్యులు**





రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 11/ అక్షరం న్యూస్ : నార్సింగి మున్సిపాలిటీ అభివృద్ధికి కౌన్సిల్ సభ్యులతో సమన్వయం చేసుకొని పని చేస్తున్నామని మున్సిపాలిటీ చైర్మెన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మెన్ గోపాల విజయబాబులు అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు, ఆమోద కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌లు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో సీసీ రోడ్డు పనులకు రూ.13.52 కోట్లు, డ్రైనేజీ పనులకు రూ.8.45 కోట్లు, కమ్యూనిటీ హాల్ పనులు రూ.22.12 కోట్లు, వైకుంఠధామం పనులకు రూ.2.62, వీధిదీపాల పనులకు రూ.2.55 కోట్లు, గ్రీనరీ పనులకు రూ.కోటి, బోర్ మెటీరియల్, పారిశుద్ధ్య కార్మికులకు పనిముట్లు, ఇతర పనులకు రూ.6.31 కోట్ల బడ్జెట్‌ను నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల సలహాలు, సూచనలు తీసుకొని ఆమోదించామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కలిసి కట్టుగా పని చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శివారెడ్డి, అమరేందర్, ఆదిత్య రెడ్డి, దుర్గేష్, ప్రవళిక కిరణ్, యాదమ్మ, డీఈ నర్సింహ్మారాజు, మేనేజర్ యోగేష్, ఇరిగేషన్ డీఈ రమ తదితరులు పాల్గొన్నారు.

## వెల్దిలో బడిబాట ర్యాలీ



జనగామ జిల్లా /రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ), జూన్ 11: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెల్ది జడ్పీ, ప్రాథమికపాఠశాలల ఆద్వర్యంలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉ పాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మనోహర్, భాస్కర చారి, సిఆర్పి కనకయ్య, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లు ఇందిర, సంధ్యారాణి, అంగన్వాడీ టీచర్లు రజిత, యాదలక్ష్మి, గౌరీశ్వరి తదితరులు పాల్గొన్నారు

## యేగినాటి హారిక కు 40 వేల రూపాయల విలువగల లాప్టాప్ ను అందజేసిన జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్



ఖమ్మం /తల్లాడ జూన్ 11 (అక్షరంన్యూస్)



హెల్పింగ్ హాండ్స్, ఖమ్మం సభ్యులు మద్దినేని ప్రసాదరావు, కమల ల ఆర్థిక సౌజన్యంతో డిగ్రీ చదువుతున్న యేగినాటి హారిక కు 40 వేల రూపాయల విలువగల లాప్టాప్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ చేతుల మీదుగా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో అందజేశారు. మద్దినేని ప్రసాదరావు 80 సంవత్సరాలు పూర్తి చేసుకుని 81 వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా హారిక అవసరాన్ని గుర్తించి లాప్టాప్ ను అందజేయడం శుభ పరిణామం అని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాదరావు, కమల దంపతులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. హారిక బాగా చదువుకుని అభివృద్ధి లోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ బాధ్యులు కొంగర పురుషోత్తమరావు, రాయల నరసింహారావు , యలమద్ది వెంకటేశ్వర్లు ( వైవి) , మద్దినేని రవి, సీనియర్ జర్నలిస్టు మాధవరావు యెగినాటి తదితరులు పాల్గొన్నారు.

# నార్సింగి మున్సిపాలిటీలో గుర్రు పెట్టినిద్రపోతున్న జలమండలి..?





- ప్రజల సమస్యలను పరిష్కరించడంలో జలమండలి అధికారుల విఫలం
- సమస్యలు వివరించేందుకు ప్రజా ప్రతినిధులు ఫోన్లు చేసినా స్పందించడం లేదంటూ ఆరోపణలు
- జలమండలి అధికారుల తీరుపై కౌన్సిల్ సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేసిన కౌన్సిలర్ ఉషారాణి

రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 11/ అక్షరం న్యూస్ : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో జలమండలి అధికారులు ఉన్నారా..? ఉంటే సమస్యలు పట్టించుకుంటున్నారా..? లేరా..? సమస్యలు వివరించాలని ప్రజలు, ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు ఫోన్లు చేసినా పట్టించుకోవడం లేదా..? అనే ప్రశ్నలకు అవుననే సమాధానాలు ప్రజల నుంచి వ్యక్తమవుతుంది. గత వేసవిలో మున్సిపాలిటీ పరిధిలో తీవ్ర నీటి ఎద్దడి, నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థలో సమస్యలను వివరించేందుకు జలమండలి అధికారులకు ఫోన్లు చేసినా, కార్యాలయానికి వెళ్లినా సరైన స్పందన రావడం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజుల తరబడి సమస్యలు స్థానికంగా విలయతాండవం చేస్తున్నా అధికారులు గుర్రు పెట్టి నిద్రపోతూ సమస్యలను గాలికి వదిలేశారని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏకంగా ప్రజా ప్రతినిధులే జలమండలి అధికారుల పని తీరుతో విసిగిపోతున్నారంటే సామాన్య మానవుల పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో జలమండలి అధికారుల నిర్లక్ష్యంతో స్థానికంగా సకాలంలో నీరు రాక నిరంతరం అవస్థలు పడుతున్నట్లు ప్రజలు వివరిస్తున్నారు. జలమండలి అధికారిణి స్ఫూర్తి, జీఎం రవీందర్, కింది స్థాయి సిబ్బంది ఎవరూ సరైన రీతిలో స్పందించడం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అసలే గత వేసవిలో ఎండలు విజృంభించాయి. దీనికి తోడు నీటి సరఫరా అంతంత మాత్రం కావడంతో ప్రజలు తాగేందుకు నీరు లేక, చెప్పుకునేందుకు అధికారులు లేక నరకయాతన అనుభవించారు. అధికారుల నిర్లక్ష్యానికి తాము ఎందుకు ఇబ్బందులు పడాలని ప్రజల నుంచి ప్రశ్నలు వినిపిస్తున్నాయి. తాము చెల్లించిన పన్నులతోనే అధికారులకు జీతాలు ఇస్తారు కదా తమ సమస్యలు మాత్రం అధికారులకు పట్టవా అనే సందేహాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తీరు మార్చుకొని జలమండలి సమస్యలు తలెత్తినప్పుడు సత్వర పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### ఫోన్లు చేసినా స్పందించడం లేదు : కౌన్సిలర్ ఉషారాణి

నార్సింగి మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను వివరించేందుకు జలమండలి అధికారులకు ఎన్ని సార్లు ఫోన్లు చేసినా స్పందించడం లేదని కౌన్సిలర్ ఉషారాణి మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశంలో గళమెత్తారు. హెచ్ఎండబ్ల్యూఎస్ కు సంబంధించిన సమస్యలను వివరించేందుకు మేనేజర్ స్ఫూర్తి, జిఎం సార్ రవీందర్ రెడ్డి, డీజీఎం నారాయణలకు పది సార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని తెలిపారు. ప్రతి సమావేశంలో హెచ్ఎండబ్ల్యూఎస్ నుంచి ఎవరూ హాజరు కావడం లేదన్నారు. పెద్దపెద్ద అపార్ట్‌మెంట్స్ కు వాటర్ వదులుతున్నారని, గ్రామంలో నీటి సమస్య ఉన్న గ్రామ ప్రజలపై శ్రద్ధ చూపించడం లేదన్నారు. ట్యాంకర్ల ద్వారా వాటర్ సప్లై ని సైతం రెండు నెలలు ఆపివేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని కౌన్సిల్‌లో చర్చించినట్లు సమాచారం.

# స్టేట్ ఫస్ట్ అన్నదే మన నినాదం





- అమరావతే మన రాష్ట్ర రాజధాని
- అభివృద్ధి కోసం అహరహరం కృషి
- కోసాధింపు చర్యలకు పూర్తిగా దూరం
- తప్పుచేసిన వారిని మాత్రం వదిలేది లేదు
- ప్రజలు ఇచ్చిన తీర్పుతో సమిష్టి కృషి చేస్తాం
- శిథిల రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు మళ్లిస్తా
- ఆర్థిక రాజధానిగా విశాఖపట్టణం అభివృద్ధి
- పోలవరం పూర్తి చేస్తాం..ప్రాజెక్టులతో పొలాలకు నీళ్లు రప్పిస్తాం
- కేంద్రంలో ఎపికి మూడు పదవులతో సముచిత స్థానం దక్కింది
- ఎన్డీయే పక్ష నేతగా ఎన్నికయ్యాక బాబు కీలక ప్రసంగం

అమరావతి,జూన్11అక్షరం న్యూస్

రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఇవ్వని తీర్పును ప్రజలు ఇచ్చారని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. అందుకు అనుగుణంగా స్టేట్ ఫస్ట్ అన్న విధానంతో ముందుకు పోతామని చంద్రబాబు అన్నారు. సిఎం అయినా ఎవరైనా అంతా ఒక్కటేనని, ప్రజలే మనకు ముఖ్యమని అన్నారు. తెదేపా-జనసేన-భాజపా కూటమి శాసనసభా పక్ష భేటీ విజయవాడలో జరిగింది. ఈ సమావేశంలో ఎన్డీయే శాసనసభా పక్ష నేతగా చంద్రబాబును ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. 'ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు. రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ప్రజలు చొరవ చూపారు. ప్రజలు ఇచ్చిన తీర్పును నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. 14 ఏళ్లుగా సీఎంగా, 15 ఏళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్నాను. ప్రతి సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుని ముందుకెళ్లాం. ఏపీలో చాలా సమస్యలు ఉన్నాయి. రాష్ట్రం పూర్తిగా శిథిలమైంది. సంక్షోభంలో ఉంది. అన్ని వర్గాలు దెబ్బతిన్నాయి. రైతులు అప్పులపాలయ్యారు. పదేళ్ల తర్వాత రాజధాని ఏదంటే చెప్పుకోలేని పరిస్థితి. కక్షపూరిత రాజకీయాలు కాకుండా నిర్మాణాత్మకంగా ముందుకు వెళ్లాలి. మూడు రాజధానులంటూ ఆటలాడే పరిస్థితి ఉండదు. అమరావతి రాజధానిగా ఉంటుంది. విశాఖను ఆర్థిక, ఆధునిక రాజధానిగా చేసుకుందాం అన్నారు. అలాగే కర్నూలును కూడా అబివృద్ధి చేద్దామని అన్నారు. నూటికి నూరు శాతం 3 పార్టీల నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేశారు. ఎన్నికల్లో 93 శాతం సీట్లు గెలవడం దేశ చరిత్రలో అరుదు. ఎన్నికల్లో 57 శాతం ఓట్లతో ప్రజలు ఆశీర్వదించారు. ప్రజల తీర్పుతో మనందరిలో మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. జనసేన పోటీ చేసిన 21 స్థానాల్లోనూ గెలుపొందింది. భాజపా పోటీ చేసిన 10 స్థానాల్లో 8 సీట్లు గెలుచుకుంది. ప్రజలు ఇచ్చిన తీర్పు వల్ల దిల్లీలో అందరూ గౌరవించారు. ప్రజల తీర్పుతో రాష్ట్ర ప్రతిష్ఠ పెరిగింది. పవన్ కల్యాణ్ సమయస్ఫూర్తిని ఎప్పటికీ మరచిపోలేను. నేను జైలులో ఉన్నప్పుడు ఆయన వచ్చి పరామర్శించారు. తెదేపా, జనసేన పొత్తు పెట్టుకుంటున్నట్లు చెప్పారు. భాజపా, తెదేపా జనసేన కలిసి పోటీ చేస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా పొత్తు పెట్టుకున్నాం. ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా కలిసి పనిచేశాం..విజయం సాధించామని అన్నారు. మీ అందరి

సహకారంతో బుధవారం సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్నా. కార్యక్రమానికి ప్రధాని మోదీ, ఎన్డీయే నేతలు హాజరవుతున్నారు. సమష్టిగా ప్రజల రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైంది. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర సహకారం అవసరం. రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తామని కేంద్ర నేతలు చెప్పారని అన్నారు.

ఓటర్లు ఇచ్చిన తీర్పు రాష్ట్ర చరిత్రలో నిలుస్తుంది. పదవి వచ్చిందని విర్రవీగితే ఇదే పరిస్థితి వస్తుంది. తప్పు చేసిన వారిని క్షమిస్తే అలవాటుగా మారుతుంది. తప్పు చేసిన వారికి చట్టపరంగా శిక్ష పడాల్సిన అవసరం ఉంది. విధ్వంస, కక్షా రాజకీయాలను ప్రక్షాళన చేయాలి. నా కుటుంబానికి అవమానం జరిగింది. గౌరవ సభ కాదు.. కౌరవ సభ అని చెప్పి బయటకు వచ్చా. ప్రజాక్షేత్రంలో గెలిచి గౌరవ సభగా చేసి అడుగు పెడతానని చెప్పా. నా శపథాన్ని ప్రజలు గౌరవించారు. గౌరవించిన ప్రజలను నిలబెట్టాలి. పోలవరం పనులు 72 శాతం పూర్తి చేశాం. డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయింది. కేంద్ర సహకారంతో ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తాం. నదులను అనుసంధానించి ప్రతి ఎకరానికి నీళ్లందిస్తాం అని అన్నారు. సీఎం పర్యటనల సందర్భంగా షాపులు బంద్ చేయడం, రోడ్లు మూసేయడం, పరదాలు కట్టుకోవడం అవన్నీ ఉండవు. సీఎం కూడా మామూలు మనిషే. మామూలు మనిషిగానే వస్తా. మిత్రుడు పవన్‌తో పాటు మేమంతా సామాన్య వ్యక్తులుగానే మీ వద్దకు వస్తాం. మీలో ఒకరిగా ఉంటాం. హోదా సేవ కోసమే తప్ప.. పెత్తనం కోసం కాదు. కాన్వాయ్ వచ్చే సమయంలో ప్రజల్ని ఇబ్బంది పెట్టొద్దని చెప్పాం. ఒక సిగ్నల్‌కి మరో సిగ్నల్‌కి గ్యాప్ పెట్టుకోండి. ఐదు నిమిషాలు లేట్ అయినా పర్వాలేదు కానీ.. ప్రజలకు అసౌకర్యం కలగకూడదని స్పష్టంగా ఆదేశించాం. దాడులు చేసి బాధితులపైనే కేసులు పెట్టే పరిస్థితి ఉండదు. ఏ ఒక్కరి ఆత్మగౌరవానికీ భంగం కలగదు. ప్రజాహితం కోసమే పనిచేస్తాం. ప్రతి నిర్ణయం, ప్రతి అడుగు ప్రజల కోసమే ఉంటుంది. 'స్టేట్ ఫస్ట్' అనే నినాదంతో ముందుకెళ్తాం అని ప్రకటించారు. కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రానికి సముచిత గౌరవం దక్కింది. ముగ్గురు ఎంపీలు కేంద్రంలో మంత్రులుగా ఉండే అవకాశం వచ్చింది. రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస వర్మకు క్యాబినెట్‌లో చోటు కల్పించారు. సాధారణ వ్యక్తిగా ఉన్న శ్రీనివాస వర్మకు భాజపా ఎంపీ టికెట్ ఇచ్చినపుడే ఆశ్చర్యం కలిగింది. ఆ తర్వాత ఆరా తీస్తే పార్టీ కోసం చాలా కష్టపడ్డాడని తెలిసింది. సామాన్య కార్యకర్తను గుర్తించిన పార్టీ భాజపా. తెదేపా, జనసేన కూడా అలా చేస్తున్నాయి. పదేళ్ల మోదీ పరిపాలన దేశప్రతిష్ఠను పెంచింది. ప్రపంచంలో భారతీయులకు గుర్తింపు తీసుకొచ్చింది. మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగబోతోంది. ఆయన కల వికసిత్ భారత్- 2047. మనది వికసిత్ ఆంధప్రదేశ్.. ఈ లక్ష్యంతో ముందుకెళ్లాలి' అని చంద్రబాబు అన్నారు.









## కూటమిపై ప్రజల విశ్వాసం

**వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి**

**బిజెపి ఎమ్మెల్యేల భేటీలో పురంధేశ్వరి**

హైదరాబాద్,జూన్11అక్షరం న్యూస్

కూటమిపై ప్రజల విశ్వాసం ఉంచి భారీ మెజార్టీతో గెలిపించారని, వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని, బిజెపి ఎమ్మెల్యేల భేటీలో పురంధేశ్వరి అన్నారు. ఏపీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మంగళవారం ఉదయం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ ఎమ్మెల్యే లతో సమావేశం అయ్యారు. శాసన సభ పక్ష నేత ఎంపికపై చర్చలు జరిపారు. అధిష్టానం ప్రకటనకు అందరూ కట్టుబడి ఉండాలని నిర్ణయించారు. అనంతరం పురందేశ్వరి పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి కూటమి సమావేశం జరుగుతున్న ఎ కన్వెన్షన్‌కు బయలుదేరి వెళ్లారు. సందర్భంగా దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు కూటమిపై విశ్వాసంతో మంచి విజయం అందించారని అన్నారు. ప్రజలు ఇచ్చిన భరోసాను తమ పని తీరుతో నిల బెట్టుకుంటామని స్పష్టం చేశారు. శాసనసభ పక్ష సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలు వివరిస్తామన్నారు. బుధవారం చంద్రబాబు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా వస్తున్నారని, రాష్ట్ర బీజేపీ పక్షాన రేపు తామంతా ఆ సభలో పాల్గొంటామని పురందేశ్వరి పేర్కొన్నారు. కాగా తెలుగుదేశం అధినేత చంద్రబాబును టీడీఎల్పీ నేతగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చం నాయుడు ప్రతిపాదన చేయనున్నారు. అలాగే ఎన్డీఏ పక్షాల తరపున ఎన్డీఏ శాసనసభ పక్ష నేతగా చంద్రబాబు పేరును జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ ప్రతిపాధించనున్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దీనిని బలపరచనున్నారు.

## జూన్ 24 నుంచి పార్లమెంట్ సమావేశాలు

**సభ్యుల ప్రమాణం..కొత్త స్పీకర్ ఎంపిక**

న్యూఢిల్లీ,జూన్11(((అక్షరం న్యూస్

కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరిన వేళ, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను కూడా నిర్వహించేందుకు కసరత్తు మొదలయ్యింది. ఈ క్రమంలో లోక్‌సభ కార్యకలాపాలు నిర్వహించేందుకు స్పీకర్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. అంతకంటే ముందుగా కొత్తగా ఎన్నికైన ఎంపీలు ప్రమాణస్వీకారం చేయాల్సి ఉంది. వీటికోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. జూన్ 24 నుంచి జులై 3 వరకు వీటిని నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. జూన్ 24-25 తేదీల్లో ఎంపీల ప్రమాణ స్వీకారం, జూన్ 26న స్పీకర్ ఎన్నిక ఉండొచ్చని సమాచారం. ఈ సమయంలో స్పీకర్ పదవి ఎవరికి దక్కొచ్చనే అంశం ఆసక్తిగా మారింది. మోదీ 3.0 ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా ఉన్న తెదేపా, జేడీయూ ఆ పదవిని ఆశించినట్లు వార్తలు వచ్చాయి. ఇండియా కూటమి పార్టీలు సైతం స్పీకర్ పోస్టుకు పట్టుబట్టాలని వీరిపై ఒత్తిడి తేవడం గమనార్హం. మరోపక్క, రాజస్థాన్ కోటా స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఓం బిర్లాకు మరోసారి అవకాశం ఇవ్వొచ్చన్న అంచనాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ భాజపా అధ్యక్షురాలు పురందేశ్వరి పేరు కూడా ప్రచారంలో ఉంది.

## నీట్ పరీక్ష రద్దు చేయడం కుదరదు

**దానికున్న ప్రతిష్టను దెబ్బతీయడమే అవుతుంది**

**నీట్ అక్రమాలపై పిటిషన్‌ను విచారించిన సుప్రీం**

**విచారణను జూలై 8కి వాయిదా వేసిన ధర్మాసనం**

న్యూఢిల్లీ,జూన్11((అక్షరం న్యూస్)

వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ - 2024 పరీక్షలో అవతవకలు జరిగినట్లు గత కొన్ని రోజులుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్న క్రమంలోనే నీట్ ప్రవేశ పరీక్షను రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టు లో పిటిషన్ దాఖలైంది. దీనిపై జస్టిన్ విక్రమ్ నాథ్, జస్టిస్ అమనుల్లాతో కూడిన వెకేషన్ బెంచ్ మంగళవారం విచారణ జరిపింది. పరీక్షను రద్దు చేయడం అంత సులువు కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇది మీరు అనుకున్నంత సులభం కాదు. అలా చేస్తే పరీక్షకు ఉన్న గౌరవం, పవితత్ర దెబ్బతింటాయి. అందువల్ల ఈ ఆరోపణలపై మాకు సమాధానాలు కావాలని ధర్మాసనం పేర్కొంది. దీనిపై స్పందన తెలియజేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి నోటీసులు జారీ చేసింది. ఇక, ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల కౌన్సిలింగ్ పక్రియపై స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది. ఆలోగా ఎన్‌టీఏ తమ సమాధానం తెలియజేయాలని కోర్టు ఆదేశించింది. ఈ ఏడాది మే 5వ తేదీన నీట్ యూజీ -2024 ప్రవేశ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే. జూన్ 4న ఫలితాలను ప్రకటించారు. అయితే తొలుత జూన్ 14న ఫలితాలను వెల్లడిస్తామని చెప్పి.. అంతకంటే ముందే ఓట్ల లెక్కింపు జరుగుతుండగా విడుదల చేయడం వివాదానికి దారితీసింది. ఈ ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు ఆలిండియా మొదటి ర్యాంక్ రాగా, వారిలో ఒకే పరీక్ష కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం పలు అనుమానాలకు దారితీసింది. ఈ పరీక్షలో పేపర్ లీకేజీ జరిగిందని, ఫలితాల్లోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ సహా పలు విపక్షాలు ధ్వజమెత్తాయి. దీంతో ఆరోపణలపై విచారణకు యూపీఎస్సీ మాజీ ఛైర్మన్

సారథ్యంలో నలుగురు సభ్యులతో కమిటీ వేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ క్రమంలోనే దీనిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి.

## హామీని నిలబెట్టుకున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

**జీతంలోంచి 4 లక్షలు కార్యకర్త కుటుంబానికి అందచేత**

కామారెడ్డి,జూన్11(అక్షరం న్యూస్

దేవుడి పేరిట ఓట్లు అడగడం.. రాముడి పేరిట దొంగ అక్షింతలు పంచడం వల్లే ఈ సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో తమ పార్టీ మెజార్టీ తగ్గిందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి వెళ్లాయన్నారు. అయోధ్యలోనే వారి పార్టీ ఓడిపోయిందంటూ బీజేపీపై ఆయన పరోక్షంగా విమర్శించారు. గాంధారి మండలం సర్వాపూర్ గ్రామాధ్యక్షుడు వెంకట్ అకాల మృతి చెందారు. ఈ నేపథ్యంలో అతడి కుటుంబాన్ని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకట్ కుటుంబానికి రూ. 4 లక్షలు ఆర్థిక సాయాన్ని ఆయన అందించారు. ఈ నగదును సొంత ఇంటి నిర్మాణానికి వినియోగించుకోవాలని ఆ కుటుంబానికి ఆయన సూచించారు. వెంకట్ భార్యకు వితంతు పెన్షన్ మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. తన జీతంలో ఒక్క రూపాయి తీసుకుని మిగతాది ప్రజల సేవకు ఉపయోగిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చానని, అందువల్ల ఒక్క రూపాయి మాత్రమే తీసుకుని నాలుగు లక్షలు మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి అందచేశానని అన్నారు. ఇదిలావుంటే బుధవారం నుంచి స్కూళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో పిల్లకు డ్రెస్సులను, పుస్తకాలను అందచేశారు. పిల్లలను బడిలో చేర్పించాలని, వారిని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్చాలని అన్నారు. అలాగే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.

# తూర్పు ఆఫ్రికా దేశమైన మలావీలో ఘోరం

**విమాన ప్రమాదంలో ఉపాధ్యక్షుడు దుర్మరణం**

**భార్య సహా..తొమ్మిదిమంది మృత్యువాత**

న్యూఢిల్లీ,జూన్11అక్షరం న్యూస్

తూర్పు ఆఫ్రికా దేశమైన మలావీ ఉపాధ్యక్షుడు సౌలోస్ చిలిమా (51) విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన భార్యతో సహా విమానంలో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది కూడా ప్రాణాలు కోల్పోయారు. మలావీ అధ్యక్షుడు లాజరస్ చక్వేరా కార్యాలయం మంగళవారం నాడు ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించింది. ఒకరోజు జాతీయ సంతాప దినంగా ప్రకటించారు. సంఘటన వివరాల ప్రకారం, మలావీ మాజీ అటార్నీ జనరల్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు చిలిమా సహా మరో తొమ్మిది మంది సైనిక విమానంలో ప్రయాణిస్తుండగా సోమవారం అదృశ్యమైంది. ప్రతికూల వాతావరణం కారణంగా ఉత్తర నగరమైన జుజులో విమానం ల్యాండ్ కావడంలో విఫలమైంది. దీంతో రాజధాని లిలాంగ్వేకి తిరిగి రావాలని సందేశం అందింది. కానీ విమానం తిరిగి రాకుండానే అదృశ్యం కావడంతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు పర్వత ప్రాంతంలో విమానం శకలాలను కనుగొన్నారు. ఒక్కరు కూడా ప్రాణాలతో బయటపడకపోవడంతో మలావీలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఇది అత్యంత హృదయవిదారకరమైన సంఘటన అని, ఈ విషయం తెలియజేయడానికి విచారం వ్యక్తం చేస్తున్నానని చక్వేరా తెలిపారు. ఈ ఘటనలో ఉపాధ్యక్షుడు సౌలస్ షిలిమా సహా 10 మంది దుర్మరణం చెందినట్లు ఆ దేశాధ్యక్షుడు లాజరస్ చక్వేరా వెల్లడించారు. గల్లంతైన విమానం శకలాలను గుర్తించామని.. అందులో ఎవరూ ప్రాణాలతో లేరని తెలిపారు. మలావీ ఉపాధ్యక్షుడు, మరో తొమ్మిది మందిని తీసుకెళ్తున్న సైనిక విమానం జూన్ 10న అదృశ్యమైంది. రాజధాని లిలోంగ్వే నుంచి బయలుదేరిన ఆ విమానం 370 కిలోమీటర్ల దూరంలోని జుజు అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాల్సి ఉంది. ప్రయాణ సమయం 45 నిమిషాలు. అయితే, ప్రతికూల వాతావరణం కారణంగా అక్కడ దిగవద్దని, తిరిగి లిలోంగ్వేకు వెళ్లిపోవాలని ఏటీసీ సూచించింది. ఈ క్రమంలోనే రాడార్‌తో విమానం సంబంధాలు తెగిపోయాయి. గల్లంతైన విమానం కోసం మలావీ సైన్యం భారీ సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ వందల మంది సైనికులు, పోలీసులు, అటవీ అధికారులతో ముమ్మరంగా గాలించింది. పొరుగు దేశాల హెలికాప్టర్లు, డ్రోన్లను రంగంలోకి దించింది. అంగోలా దేశ అంతరిక్ష కేంద్రం సహాయాన్ని కోరింది. అమెరికా, బ్రిటన్, నార్వే, ఇజ్రాయెల్ కూడా సహాయం అందించేందుకు ముందుకువచ్చాయని మలావీ ప్రభుత్వం వెల్లడించింది. ఈ క్రమంలోనే కూలిపోయిన విమాన శకలాలను గుర్తించినట్లు తెలిపింది.

## ఫ్లైయాష్ రవాణాలో కుంభకోణం

**మంత్రి పొన్నం హస్తం ఉందన్న కౌశిక్ రెడ్డి**

హైదరాబాద్,జూన్11అక్షరం న్యూస్

ఎన్టీపీసీ నుంచి ఫ్లైయాష్ రవాణా విషయంలో నిబంధనలు ఉల్లంఘించి పెద్దఎత్తున కుంభకోణం జరుగుతోందని.. ఈ విషయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఎక్కడైనా చర్చకు సిద్ధమని భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సవాలు విసిరారు. రెట్టింపు పరిమాణంతో ఫ్లైయాష్ తరలిస్తూ ఓవర్ లోడ్‌తో లారీలు వెళ్తున్నాయని.. ఈ వ్యవహారంలో మంత్రికి రోజుకు రూ.50 లక్షలు డబ్బులు ముడుతున్నాయని మరోమారు ఆరోపించారు. పొన్నం ప్రభాకర్ అన్న కొడుకు అనూప్ ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నారని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా తాను స్వయంగా లారీలను పట్టుకుంటే రెండింటిని మాత్రమే సీజ్ చేసి మిగతా వాటిని వదిలిపెట్టారని కౌశిక్ రెడ్డి తెలిపారు. రవాణా శాఖ మంత్రి ఫోన్‌తో లారీలను అధికారులు వదిలిపెట్టారని ఆరోపించారు.

## సమాచార కమిషనర్లకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్,జూన్11అక్షరం న్యూస్

ప్రధాన, రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈనెల 29లోపు దరఖాస్తులు పంపించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ సమాచార కమిషనర్ల నియామకానికి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. గతంలో దరఖాస్తు చేసిన వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని సీఎస్ శాంతికుమారి స్పష్టం చేశారు.

## ఎన్‌డిఎ భేటీలో అరుదైన సంఘటన

**1995లో చంద్రబాబు పేరును ప్రతిపాదించిన దగ్గుబాటి**

**ఇప్పుడు సిఎంగ చంద్రబాబను బలపర్చిన సతీమణి పురందేశ్వరి**





అమరావతి,జూన్11అక్షరం న్యూస్

ఎన్‌డిఎ కూటమి శాసనసభ పక్ష సమావేశంలో అరుదైన ఘటన చోటు చేసుకుంది. 1995లో తొలిసారి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. ఆ సమయంలో తెలుగుదేశం శాసనసభ పక్ష సమావేశంలో తొలిసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు పేరును దగ్గుబాటి వెంకటేశ్వర రావు ప్రతిపాదించారు. 29 ఏళ్ల తర్వాత జరిగిన కూటమి శాసనసభ పక్ష సమావేశంలో ముఖ్యమంత్రిగా

చంద్రబాబు పేరును దగ్గుబాటి వెంకటేశ్వరరావు సతీమణి, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి బలపరిచారు. 95 నాటి పరిణామాలను మరోసారి టీడీపీ నేతలు ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటున్నారు. ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో అంతకు ముందు కూడా ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో కూటమి పార్టీలు అంతా సమానమేననే సంకేతాలను చంద్రబాబు ఇవ్వడం జరిగింది. సిబ్బంది తన కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కుర్చీని తొలగించి అందరితో సమానమైన కుర్చీ తీసుకు రమ్మని చంద్రబాబు చెప్పారు. కూటమి అధినేతలు కూర్చున్నటువంటి కుర్చీనే తెప్పించుకొని అందరితో కలిసి చంద్రబాబు కూర్చొన్నారు. కూటమి పార్టీలు, నాయకులు, కార్యకర్తలు అందరూ ఇదే స్ఫూర్తి తో పనిచేయాలని తన చర్యలు ద్వారా సందేశం పంపారు. ఇది మంచి పరిణామం అంటూ కూటమి నేతలు అన్నారు.

# బాబు ప్రమాణస్వీకారానికి రేవంత్‌కు అందని ఆహ్వానం

**కాంగ్రెస్ సిఎం కావడం వల్లనే దూరం పెట్టినట్లు సమాచారం**

హైదరాబాద్,జూన్11అక్షరం న్యూస్



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయబోతున్న వేళ తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం అందలేదు. కేవలం ఎన్‌డిఎ మిత్రులకు, సిఎంలకు మాత్రమే ఆహ్వానాలు అందినట్లు సమాచారం. ఈ క్రమంలో కాంగ్రెస్ సిఎంగా ఉన్న రేవంత్ రెడ్డికి ఆహ్వానం పంపలేదు. అందుకే చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అహ్వానం అందలేదు. మొదటి నుండి చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడుగా ఉన్నా రేవంత్ రెడ్డి టీడీపీలోనే ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా పని చేశారు. అనంతరం రాజకీయ అనివార్యతతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2023 డిసెంబర్‌లో రేవంత్ రెడ్డి సీఎం కాగానే చంద్రబాబు ఫోన్ చేసి అభినందించారు. అనంతరం జరిగిన ఏపీ ఎన్నికల్లో చంద్రబాబు ఘన విజయం సాదించారు. తాజాగా ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య ఆరోగ్యకర వాతావరణం ఉండాలని, విభజన చట్టాలను స్నేహపూర్వక వాతవరణం అమలు చేసుకోవాలని ఇరువురు అబిప్రాయాపడ్డారు. ఈ పరిణామాలతో తాజాగా ఏపీలో జరిగే చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి రేవంత్ రెడ్డి హాజరవుతారని అందరు అనుకున్నారు. కానీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఇప్పటి వరకు ఎలాంటి అహ్వానం అందలేదని తెలుస్తోంది. దీంతో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రేవంత్ రెడ్డి హజరు కావడం లేదని సమాచారం. సాధారణంగా ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారాలకు పక్క రాష్ట్రాల సీఎంలను పిలవడం అనావాయితీ. గతంలో ఏపీ సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేసినప్పుడు తెలంగాణ సీఎంగా ఉన్న కేసిఆర్ హజరయ్యారు. కానీ ఇప్పుడు తెలుగుదేశం ఎన్డీఏ లో కీలక భాగస్వామిగా ఉండటం, తెలంగాణలో ఇండియా కూటిమిని లీడ్ చేస్తున్న కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో, ఆహ్వానం ఇవ్వలేదని తెలుస్తోంది. ఇక అటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమానికి వస్తుండటంతో కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, ఇండియా కూటమి నేతలు వేదికను పంచుకోవడం ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే రేవంత్ రెడ్డికి ఏపీ సర్కార్ ఆహ్వానం పంపకపోవడానికి కారణమై ఉంటుందని భావిస్తున్నారు.

## చంద్రబాబు ప్రమాణానికి స్టార్ హీరోలు

**చరింజీవి, జూనియర్ ఎన్టీరా÷-, రజనీలకు ఆహ్వానం**

**వారితో పాటు పలువురు టాలీవుడ్ హీరోలకూ పిలుపు**

విజయవాడ,జూన్11అక్షరం న్యూస్

ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి అగ్ర కథానాయకుడు చిరంజీవి హాజరుకానున్నారు. రాష్ట్ర విశిష్ట అతిథిగా హాజరు కావాలని కోరుతూ చిరంజీవికి ప్రత్యేక ఆహ్వానం అందింది. మంగళవారం సాయంత్రం 5 గంటలకు బేగంపేట నుంచి ప్రత్యేక విమానంలో చిరంజీవి విజయవాడ బయలుదేరారు. ఆయనతోపాటు జూనియర్ ఎన్టీఆర్‌కు కూడా ఆహ్వానం అందింది. దేవర చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్న తారక్ కూడా ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు అయ్యే అవకాశం ఉంది. అలాగే రజినీకాంత్, మోహన్ బాబు, రామ్‌చరణ్, అల్లు అర్జున్, నారా రోహిత్ తో పాటు మరికొందరు సినీ తారలకు ఆహ్వానం అందినట్లు

సమాచారం. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎన్టీఆర్ హాజరు అవుతారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. అందుకు కారణం కొంతకాలంగా జూ.ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ విషయంలో నిశ్శబ్దంగా ఉంటున్నారు. పలు సందర్భాంలో పార్టీ ప్రస్తావన తీసుకొచ్చినా ఆ టాపిక్ గురించి మాట్లాడటం లేదు. అయితే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన నారా చంద్రబాబునాయుడు 'ప్రియమైన మావయ్యకు శుభాకాంక్షలు' అంటూ తారక్ ట్వీట్ చేశారు. దానికి చంద్రబాబు కూడా 'థ్యాంక్స్ అమ్మా' అని రిప్లై ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం అందుకున్న తారక్ హాజరు అవుతారా? లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. అలాగే మరో నటుడు అల్లు అర్జున్ కు కూడా ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. ఆయన కూడా హాజరు అవుతారా లేదా అన్నది తెలియాల్సి ఉంది. ఎందుకంటే మొన్నటి ఎన్నికల్లో అల్లు అర్జున వైసీపీ అభ్యర్థికి మద్దతుగా నిలిచి ట్రోలింగ్‌కు గురయ్యారు. అయినా బన్నీకి ఆహ్వానం పంపించి టీడీపీ హుందాగా వ్యవహరించిందని సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి.

## వేములవాడలో గుండెపోటుతో భక్తుడు మృతి

వేములవాడ,జూన్11అక్షరం న్యూస్

దైవ దర్శనానికి వెళ్లి ఓ భక్తుడు గుండెపోటుతో మరణించాడు. ఈ విషాదకర సంఘటన వేములవాడలో చోటు చేసుకుంది. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు జనగామ జిల్లాకు చెందిన బొట్ల వినయ్ కుమార్ ఆలయానికి చేరుకున్నారు. రాజన్న దర్శనం అనంతరం శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి దర్శనానికి వెళ్లే మార్గ మధ్యలో గుండెపోటు వచ్చింది. అప్రమత్తమైన కుటుంబీకులు ఏరియా హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వినయ్ కుమార్ మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేపట్టారు.

## నేటినుంచి స్కూళ్ల ప్రారంభం

**అమ్మ ఆదర్శ పాఠశాలలతో ఉత్తమ విద్య**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**

భద్రాద్రి కొత్తగూడెం,జూన్11((అక్షరం న్యూస్

పేద పిల్లలకు మంచి విద్య అందించే లక్ష్యంతో అమ్మ ఆదర్శ పాఠశాలలు పనిచేస్తాయని సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జూన్ 12న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్నట్లు మంత్రి తెలిపారు. ఈ మేరకు ఆయన పాఠశాలల పునఃప్రారంభం సహా పలు అంశాలపై కొత్తగూడెం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. 'రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం విద్యతోపాటు ఇంగ్లీష్ మీడియం కూడా అందిస్తున్నాం. కళాశాల విద్యకూ పెద్దపీట వేస్తున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాఠశాలకు మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా విఫలమైంది. రూ.39వేల కోట్లతో మిషన్ భగీరథ పథకం ప్రారంభించినా.. జిల్లాలోని గిరిజన ప్రాంతాలకు నీటి సరఫరా అధ్వానంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ పథకాన్ని పునరుద్ధరించి గిరిజన ప్రాంతాలకు తాగునీటి సమస్య లేకుండా చేస్తాం. ధరణిపై కమిటీ నివేదిక త్వరలో రానుంది, అందులోని ఇబ్బందికర అంశాలను తొలగించి, పెండింగ్‌లో ఉన్న 2.55లక్షల దరఖాస్తులు పరిష్కరిస్తాం. విత్తనాలు అందుబాటులో లేవని బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. మేలైన ఒకే రకం విత్తనాలపై ప్రచారం చేసి కృత్రిమ డిమాండ్ సృష్టిస్తూ రైతులను బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు గురి చేస్తున్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్‌ఉండదంటూ దుష్ప్రచారాలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పవర్ కట్ అనే సమస్యే లేదు. ప్రభుత్వ స్థలాలను ఏ స్థాయి వ్యక్తులు కబ్జా చేసినా.. కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు మూసుకొని ఉండదు' అని హెచ్చరించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ఛార్జిషీటు దాఖలు

హైదరాబాద్,జూన్11(అక్షరం న్యూస్

తెలంగాణలో సంచనలం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి మార్చి 10న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. ఇప్పటి వరకు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావును అరెస్టు చేశారు. ఛార్జిషీట్‌లో ఆరుగురిని నిందితులుగా పేర్కొన్నారు. మరో వైపు అడిషినల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న నాంపల్లి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. రాజకీయ దురుద్దేశంతోనే అరెస్టు చేశారని, కేసులో సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించలేదని పిటిషనర్ తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ ఇంకా విచారించాల్సి ఉన్నందున నిందితులకు బెయిల్ మంజూరు చేయొద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) కోర్టును కోరారు. బెయిల్ పిటిషన్లపై వాదనలు పూర్తి కావడంతో బుధవారం తీర్పు వెల్లడించనున్నట్టు నాంపల్లి కోర్టు స్పష్టం చేసింది.

# విచారణకు హాజరైన వారంతా అఫిడవిట్లు ఇవ్వాలి

**కాళేశ్వరం కమిషన్ చీఫ్ పీసీ ఘోష్ వెల్లడి**

హైదరాబాద్,జూన్11అక్షరం న్యూస్

ఈ నెల 25వ తేదీలోపు తమ విచారణకు హాజరైన వారందరూ అఫిడవిట్లు ఫైల్ చేయాలని, తప్పుడు అఫిడవిట్లు ఇస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కాళేశ్వరం కమిషన్ చీఫ్ పీసీ ఘోష్ చెప్పారు. మంగళవారం ఆయన జలసౌధలో మీడియాతో చిట్ చాట్ చేశారు. తాజాగా 20 మందితో సమావేశమైనట్టు తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన, తెలిసిన అంశాలన్నింటినీ అఫిడవిట్ రూపంలో ఇవ్వాలని చెప్పామని అన్నారు. రెండురోజుల పాటు ఇంజినీర్లతో సమావేశమైనట్టు తెలిపారు. రేపటి నుంచి ఏం చేయాలనేదానిపై జాబితాను సిద్ధం చేస్తామని అన్నారు. త్వరలో నిర్మాణ సంస్థలనూ విచారణకు పిలుస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారమే వ్యవహరించాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో అధికారుల పేర్లు ఉంటే వారికి కూడా నోటీసులు ఇస్తామని ఘోష్ వెల్లడించారు. బ్యారేజీలు సరిగా పనిచేస్తే ప్రజలకు ఎంతో లాభం జరుగుతుందని అన్నారు. ఎక్కడో ఏదో తప్పుడు లెక్కల వల్ల ఇలా జరిగినట్టు అనిపిస్తోందని తెలిపారు.

## ఎన్‌డిఎ సమావేశంలో బాబుకు ప్రత్యేక కుర్చీ

**వద్దని వారించి..తిరస్కరించిన టిడిపి అధినేత**

అమరావతి,జూన్11(అక్షరం న్యూస్

ఎన్డీయే కూటమి సమావేశంలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఈ సమావేశంలో ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా చంద్రబాబును టీడీపీ – జనసేన – బీజేపీ ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ క్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఒకే వేదికపై ఆశీనులయ్యారు. ఈ వేదికపై చంద్రబాబు కోసం ప్రత్యేక కుర్చీని సిద్ధం చేయగా ఆయన తిరస్కరించారు. కూటమి నేతలందరికీ ఒకే తరహా కుర్చీ ఉండాలని భద్రతా సిబ్బందికి చెప్పారు. దీంతో వారు సాధారణ కుర్చీని తెప్పించగా.. దానిపై కూర్చున్నారు. ఇది చంద్రబాబు సంస్కారం అని టీడీపీ నేతలు కొనియాడుతున్నారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. తనను కూటమి శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్న నేతలకు చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ఏపీలో గత ఐదేళ్లలో విధ్వంస పాలన సాగిందని.. తాము సామాన్యులుగానే ఉంటామని.. అలానే ప్రజల్లోకి వెళ్తామని స్పష్టం చేశారు. తప్పు చేసిన వారికి చట్టపరంగా శిక్ష ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రానికి సముచిత స్థానం దక్కిందని.. ముగ్గురు ఎంపీలకు కేంద్ర మంత్రులుగా అవకాశం వచ్చిందని చెప్పారు. 'రామ్మోహన్, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మకు కేబినెట్ లో చోటు కల్పించారు. సామాన్య కార్యకర్తకు సముచిత స్థానం కల్పించారు. టీడీపీ బీజేపీ జనసేన కూటమి కూడా అలానే పని చేస్తాయి. పదేళ్ల మోదీ పరిపాలన దేశప్రతిష్టను పెంచింది. ప్రపంచంలో భారతీయులకు గుర్తింపు తీసుకొచ్చింది. మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగబోతోంది. ప్రధాని మోదీ కల వికసిత్ భారత్ – 2047 అయితే, మనది వికసిత్ ఆంధ్రప్రదేశ్.. ఇదే లక్ష్యంతో ముందుకెళ్లాలి.' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.



## బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు రక్షణ పరికరాలు అందజేత



**రామగిరి (పెద్దపల్లి జిల్లా) జూన్ 11 అక్షరం న్యూస్:** ఆర్జీ–3 ఓసిపి 2 బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్టర్ డి తిరుపతి సంబంధిత కాంట్రాక్ట్ కార్మికులకు రక్షణ పరికరాలు టోపి,బూట్లు,చెమ్మస్ మంగళవారం కార్మికులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ నాడెం శ్రీనివాస్ ,వెగోలపు సంతోష్ సెక్షన్ నాయకులు ఆర్ రాజేశం పి శ్రీనివాస్ పీ భూమయ్య ఏ రాజేశం బి కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

## బేగంపేటలో బడిబాట



**రామగిరి (పెద్దపెల్లి జిల్లా) జూన్ 11 అక్షరం న్యూస్:** రామగిరి మండలం బేగంపేట గ్రామ అంగన్ వాడి కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. తల్లులకు గుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారాంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో అంగన్ వాడీ టీచర్లు కొంద్ర సుమత, రాచర్ల సరోజ న తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన అధికారులకు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం



**రామగిరి (పెద్దపెల్లి జిల్లా) జూన్ 11 అక్షరం న్యూస్:** ఆర్జీ– 3 జిఎం కార్యాలయంలో ఏజీఎం (ఈ అండ్ ఎం ) గా విధులు నిర్వహిస్తున్న పి ఎలీషా జిఎం ఇ అండ్ ఎం స్టోర్ కార్పొరేట్ గా పదోన్నతి పొందినందుకు, అలాగే డివైపింగా విధులు నిర్వహిస్తున్న కే మారుతి పర్సనల్ మేనేజర్ గా పదోన్నతి పొందిన సందర్భంగా మంగళవారం సెంటినరీ కాలనీలోని లయన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా శాల తో సత్కరించి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ వీరు సేవలను కొనియాడారు సింగరేణి కంపెనీ అభివృద్ధిలో మరియు కార్మికులకు సేవలందించడంలో వీరు ముందంజలో ఉన్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్, డైరెక్టర్స్ గంట వెంకటరమణారెడ్డి, గడ్డం శ్రావణ్ కుమార్, టీ వీ సురేష్ బాబు, తీగల శ్రీధర్, సునీల్, సుధాకర్, రమ్య రెడ్డి సుధా ఇంకా ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉదయం సమయంలో మంథని నుండి కరీంనగర్‌కు ఎక్స్ ప్రెస్ లు నడపండి



**రామగిరి (పెద్దపెల్లి జిల్లా) జూన్ 11 అక్షరం న్యూస్ :** మంథని డిపో నుండి కరీంనగర్ కు ఉదయం పూట ఎక్స్ ప్రెస్ బస్సులను నడపాలని మాజీ తెలుగుదేశం పార్టీ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు ప్రస్తుత బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లవల్లి శంకర్ మంథని టీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. కాగా ఉదయం 9 గంటల నుండి 11 గంటల సమయం వరకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని ఆ సమయంలో బస్సులు చాలా వరకు తక్కువగా ఉన్నాయని దీంతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారిందని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. మంథని నుండి బేగంపేట సెంటినరీ కాలనీ కలవచర్ల కమాన్ పూర్ బస్టాప్ ల వద్ద ప్రయాణికులు బస్సుల కోసం వేసి చూడాల్సి వస్తుంది అని తెలియజేశారు. ఇప్పటికైనా సమయానుకూలంగా బస్సులను పెంచాలని కోరారు.

## గోదావరి లోయ ప్రతిఘటనా పోరాట నేత రాధక్కకు విప్లవ జోహార్లు

**- గౌని ఐలయ్య సిపిఐ (ఎం-ఎల్ )న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి...**



**మహబూబాబాద్ /గార్ల /జూన్ 11/అక్షరం న్యూస్:** గోదావరిలో ఏ ప్రతిఘటన పోరాట నిర్మాత భారత విప్లవోద్యమ అగ్రనేత చంద్ర పుల్లారెడ్డి జీవిత సహచరిగా గోదావరి లోయ పరివాహక ప్రాంతంలో ప్రతిఘటన పోరాటాన్ని నిర్మించడంలో తనదైన పాత్రను పోషించిన రాదక్క అలియాస్ నిర్మలక్క క్యాన్సర్ బారిన పడి ఈరోజు ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాదులో మరణించారని, ఆమెకు సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ విప్లవ జోహార్లు అర్పిస్తున్నదని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండల కేంద్రంలోని స్థానిక న్యూడెమోక్రసీ కార్యాలయంలో రాధక్కకు నివాళులర్పిస్తూ, సంతాప కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, భారత విప్లవోద్యమ చరిత్రలో ప్రతిఘటనా పోరాటానికి ఎంతో ప్రాధాన్యత వున్నదని,మంథని మహదేవ్ పూర్ నుండి శ్రీకాకుళం వరకు గోదావరిలోయ పరీవాహక ప్రాంతంలో ఉవ్వెత్తున సాగిన ప్రతిఘటనా పోరాటంలో రాధక్క ప్రత్యక్షంగా పాల్గొని నాయకత్వం వహించిందన్నారు. ఆదివాసీ,గిరిజనుల కోసం గోదావరి లోయలో అసమాన త్యాగాలతో సాగిన ఉద్యమానికి పుల్లారెడ్డి తో కలిసి నాయకత్వం వహించిన రాధక్క చివరి శ్వాసవరకు ప్రతిఘటనా పోరాట రాజకీయాలతోనే కొనసాగిందన్నారు కామ్రేడ్ సీపీ మరణాంతరం ఆయన విలువైన రచనలను వాల్యూమ్ లుగా ముద్రించి రాధక్క విప్లవ శ్రేణులకు అందించిందన్నారు. ఆమె మరణం విప్లవోద్యమానికి తీరని లోటని,ఆమె నడిచిన ప్రతిఘటనా పోరాట బాటే భారత ప్రజల విముక్తి బాటని, ఆమార్గంలో పయనించటమే రాధక్కకు అర్పించే ఘన నివాళని ఐలయ్య అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ రామగిరి బిక్షం, ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఊకె పద్మ,పార్టీ బయ్యారం మైదాన మండల కార్యదర్శి మాధంశెట్టి నాగేశ్వరరావు పార్టీ నాయకులు కొదుమూరి నాగేశ్వరరావు, జెరిపోతుల బుచ్చయ్య, కోనూరి యుగేందర్,నిడికొండ మహేశ్,ఎనుగుల మురళీ ,బీరెడ్డి సంగయ్య,వీరబోయిన ఐలయ్య,రెడ్డి మల్ల విశ్వనాథం,ఊకె శేషు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు నీళ్లు.. గుట్టుగా అక్రమ నిర్మాణాలు..!





**- ఆదిరస్తా లో దర్జాగా అక్రమ నిర్మాణం సాగుతోందన్నా పట్టించుకోని అధికారులు.**
**- అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్య తీసుకోవాలి.**
**- అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతుంటే మున్సిపల్ అధికారులు నిద్రమత్తు ను వీడాలి.**
**- తక్షణమే మున్సిపల్ కమిషనర్‌తో పాటు ప్రణాళిక విభాగం అధికారులు వెంటనే స్పందించాలి.**
**- అనుమతులు లేని భవన నిర్మాణాలను వెంటనే నిలిపివేయించాలని. నగర పంచాయతీకి పన్నుల ఆదాయం పెంచాలని కోరుతున్న గ్రామ ప్రజలు.**

**రాజన్న సిరిసిల్ల /వేములవాడ, జులై - 11 (అక్షరం న్యూస్):** /ఆర్సి ఇంచార్జ్ /టి.ఎన్.స్వామి/ భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో అక్రమార్కుల రాజ్యం విరజిల్లుతుంది ఎలాంటి అనుమతులు, కనీస నియమ నిబంధనలు పాటించకుండ ఎంత కావాలంటే అంత రోడ్డును సైతం ఆక్రమిస్తూ జీరో సెట్ బ్యాక్ తో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు నన్నెవరు ఆపేది అంటూ.. రెచ్చిపోతూ బిల్డింగ్ నిర్మాణాలు పూర్తి చేసే పనిలో నిర్మాణదారులు నిమగ్నమై ఉన్నారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. పైరవీకారుల అండదండలతో అనుమతులు లేకుండానే దర్జాగా భవనాలు నిర్మిస్తున్నారు. రద్దీగా ఉండే రహదారులు, సందులు, ఇలా ఎక్కడ చూసినా నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మున్సిపాలిటీ పర్మిషన్‌లో పొందుపరిచిన ప్లాన్‌కు పొంతన లేకుండా కొన్ని, అనుమతే తీసుకోకుండా మరికొన్ని నిర్మిస్తున్నారు. మాస్టర్‌ప్లాన్‌కు విరుద్ధంగా సెట్‌బ్యాక్ విడిచిపెట్టకుండానే నిర్మాణాలు జరుగుతున్నాయి. చాలాసార్లు మున్సిపాలిటీ నుంచి అనుమతి నిరాకరించినా పట్టించుకోకుండా నిర్మాణాలు సాగుతూనే ఉన్నాయి. ఇక అంతస్తుల పెంపు, సెట్‌బ్యాక్ వదలకపోవడం, సెల్లార్, పార్కింగ్ కూడా కనీసం లేకుండా మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్నా పాలకవర్గం కానీ, జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం కానీ పట్టించుకోవడం లేదు. అక్రమ నిర్మాణాలను . ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోగా నిత్యం అధికారులు వెళ్లే రహదారుల మార్గంలో జరుగుతున్న అటువైపు కన్నెత్తి చూడకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది.

# క్రీడలు మానసిక ఉల్లాసం పెంపొందిస్తాయి

**- క్రీడలు రేపటి తరానికి దోహదపడుతాయి...**
**- విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలి...**
**- ఎస్ఐ ఎన్ జీనత్ కుమార్...**
**- ఘనంగా సమ్మర్ బాస్కెట్‌బాల్ ముగింపు కార్యక్రమం...**



**మహబూబాబాద్ /గార్ల /జూన్ 11/అక్షరం న్యూస్:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించినప్పుడే భవిష్యత్తు బంగారు బాట అవుతుందని గార్ల ఎస్సై ఎన్ జీనత్ కుమార్,మాజీ ఫిజికల్ డైరెక్టర్ రామన్న అన్నారు. మహబూబాబాద్ జిల్లా, గార్ల మండల కేంద్రంలోని స్థానిక బాస్కెట్ బాల్ గ్రౌండ్ లో నిర్వహించిన బాస్కెట్ బాల్ సమ్మర్ కోచింగ్ ముగింపు కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థులకు విజ్ఞానానికి చదువు ఎంత అవసరమో, మానసిక వికాసానికి క్రీడలు కూడా అంతే అవసరమన్నారు. క్రిడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, క్రిడల్లో రాణిస్తే ఆరోగ్యంతో పాటు మేధస్సు వస్తుందన్నారు. బాస్కెట్ బాల్ క్రీడలో మెలకువలు నేర్చుకొని మండల స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు విద్యార్థిని విద్యార్థులు ఎదిగి గార్ల మండలానికి, కన్న తల్లిదండ్రులు,కోచ్ లకు పేరు ప్రఖ్యాతలు తీసుకొని రావాలని కోరారు. అనంతరం బాస్కెట్ బాల్ అసోసియేషన్ గార్ల మండల అధ్యక్షులు సూత్రపు జయశంకర్ మాట్లాడుతూ, గార్ల మండలంలో అంతరించిపోతున్న బాస్కెట్ బాల్ క్రీడకు పూర్వ వైభవం తేవడానికి ఎంతో మంది రామన్న శిష్యులు ఆర్థిక సహాయం చేయడం వలన ఈనాడు బాస్కెట్ బాల్ మట్టి కోర్టును విద్యుత్ ఫెడ్ లైటింగ్ లతో ఏర్పాటు చేసుకొని దాదాపు 40 మంది విద్యార్థిని విద్యార్థులకు సమ్మర్ కోచింగ్ ఇవ్వడం జరిగిందని, ఎంతో మంది గార్ల నుండి బాస్కెట్ బాల్ క్రీడలో జాతీయస్థాయిలో రాణించి ఉన్నతమైన ఉద్యోగాలలో స్థిరపడి ఉన్నారని అన్నారు. గార్లలో బాస్కెట్ బాల్ సిమెంట్ కోర్టు ఉన్నట్లయితే చాలా మంది విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇచ్చి ఉన్నత స్థాయికి ఎదిగేలా చేయగలమని ప్రజా ప్రతినిధులు గార్లలో బాస్కెట్ బాల్ సిమెంట్ కోర్టు నిర్మాణానికి తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు.అనంతపురం సమ్మర్ కోచింగ్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికేట్ తోపాటు మెమోంటోను ఎస్ఐ జీనత్ కుమార్ మాజీ పి.డి రామన్న చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో జాతీయస్థాయి అథ్లెటిక్ గోల్డ్ మెడల్ సాధించిన సాంబమూర్తి, గార్ల మండల బాస్కెట్ బాల్ అసోసియేషన్ సభ్యులు తోడేటి రాము, కత్తుల ప్రశాంత్, బూర్ల చంద్రశేఖర్,రెడ్డిమల్ల ఉమేష్ , శేఖర్, ఆశిష్ జైన్,అలవాల పవన్,రిజ్వాన్,సిద్దు మేఘన్ విద్యార్థిని,విద్యార్థులు, తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఖాతాలో రైతుబంధు జమ చేయాలి





**- పాత రుణాలు మాఫీ చేసి, కొత్త రుణాలు మంజూరు చేయాలి...**
**- ముందస్తు గానే పంటల మద్దతు ధర ప్రకటించాలి...**
**- రైతు సమస్యలపై కలెక్టరేట్ ఎదుట ధర్నా...**
**- ఏఐకెఎమ్ఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు,జిల్లా కార్యదర్శి జి సక్రు**

**మహబూబాబాద్ /గార్ల /జూన్ 11/అక్షరం న్యూస్:** జిల్లాలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకై మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకెఎమ్ఎస్)ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించినారు అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐకెఎమ్ఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి సక్రు లు మాట్లాడుతూ, రైతులకు మండల వ్యవసాయ శాఖ ద్వారా అన్ని రకాల పంటలకు నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై సకాలంలో అందించేటట్లు చర్యలు తీసుకోవాలని, సొసైటీల ద్వారా తక్కువ ధరలకు ఎరువులను అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు పంటలపై ఐదు వందల రూపాయల బోనస్ ను వెంటనే రైతులందరికీ వారి ఖాతాలో జమ చేయాలని ,పట్టణాలలో మండల కేంద్రాలలో నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులను విక్రయించే షాపులపై ఉక్కు పాదం మోపాలని, రైతుబంధు సాయంను ఈ ఖరీఫ్ సీజన్ లో వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని కోరారు. ముందస్తుగానే పంటల మద్దతు ధర ప్రకటించాలని, రైతుల పాత రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలను అందించాలని, వ్యవసాయ అధికారులు,విస్తరణ అధికారులు రైతు క్షేత్రాలలో మమేకమై రైతుల భూముల భూసార పరీక్షలను నిర్వహించి, రైతు సమస్యలను తీర్చి మంచి పంటలు దిగుబడికై రైతులందరినీ సమన్వయ పరుస్తూ గ్రామ గ్రామాలలో సమావేశాలను,రచ్చబండలను నిర్వహించి తగు సలహా సూచనలను అందించి మండల కేంద్రాలలోని విత్తన ఎరువుల షాపుల పై పర్యవేక్షణ పెంచాలని డిమాండ్ చేశారు.ధర్నా అనంతరం పై డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కు అందించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు మురళి, తోకల వెంకన్న, బట్టు వెంకన్న, ఎస్కే బాబు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీ మహిళలు, పోషకాహార లోపం ఉన్న వారికి బిసిజి టీకా ఇవ్వకూడదు





**- డాక్టర్ బి. కళావతి బాయి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి...**

**మహబూబాబాద్ /గార్ల /జూన్ 11/అక్షరం న్యూస్:** మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గర్భిణీ మహిళలకు, పోషకాహర లోపం ఉన్న వారికీ బిసిజి టీకా ఇవ్వకూడదని మహబూబాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. కళావతి బాయి తెలిపారు.

అడల్ట్ బి సి జి వ్యాక్సిన్ టీక పై రెండవ రోజు శిక్షణా కార్యక్రమం – కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, మరియు హెల్త్ సూపర్వైజర్స్ కి, ఐఎంఏ హాల్లో పత్తిపాక రోడ్లో, రెండవ రోజు,జిల్లాలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కి,హెల్త్ సూపర్వైజర్స్, టీబి ప్రోగ్రాంలో పని చేస్తున్న ఎస్టిఎస్ కు,మరి యు ల్యాబ్ టెక్నీషియన్స్ కి వయోజన బీసీజీ వ్యాక్సిన్ పై జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి కళావతి భాయి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ, జిల్లాలో 18 సంవత్సరాల పైబడిన వారందరికీ బీసీజీ టీకా అందించేందుకు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. డాక్టర్ అంబరీష్ , డిప్యూటీ డిఎంహెచ్ఓ, ప్రోగ్రాం ఆఫీసర్ ఇమ్యూనైజేషన్ మాట్లాడుతూ, ఎవరైతే అనారోగ్య కారణాలు ఉన్న, టీబి పేషెంట్స్ కు, గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు, పోషకాహార లోపం ఉన్న వారికి, 18 సంవత్సరాల కన్న తక్కువ వయస్సు ఉన్నవారికి,గత మూడు నెలల్లో రక్తమార్పిడి చరిత్ర గలన వ్యక్తులకు, హెచ్ఐవి సంక్రమణ సోకే అవకాశం ఎక్కువగా ఉన్న వ్యక్తులకు ఈ వ్యాక్సిన్ ఇవ్వకూడదని పేర్కొన్నారు.జిల్లాలోని పెద్దలకు ఉచితంగా బీసీజీ వ్యాక్సిన్ అందించేందుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని, ఈ శిక్షణ పూర్తయిన తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్ర స్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని,బీసీజీ,వ్యాక్సిన్ సార్వత్రిక వ్యాధికి నిరోధక టీకాగా చిన్న పిల్లలకి ఇచ్చేదని, పెద్ద వాళ్లకు అడల్ట్ డోస్ ఇస్తారని, ఎలాంటి అపోహలు పడవద్దని కోరారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరెవరికి ఇవ్వాలనేది సర్వే ఆధారంగా గుర్తించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎమ్ఎచ్ఓ డాక్టర్ అంబరీష్, డాక్టర్ మురళీధర్, డాక్టర్ విజయ్ కుమార్ ,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ క్రిష్ణార్జునరావు, కెవి రాజు , గీతా హెల్త్ ఎడ్యుకేటర్స్ , వడ్డే బోయిన శ్రీనివాస్,రామకృష్ణ హెచ్ ఇ ఓ ,డీడియం సామిత్, ఏపీ డేమిలోజిస్ట్ రవి,నీలిమ శ్వేత, అశోక్, శ్రీనివాస్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐ.టి.ఐలో ప్రవేశాలకు జూన్ 14 వరకు దరఖాస్తు తేదీ పొడిగింపు

**- ఐ.టి.ఐ ప్రిన్సిపల్ ఏ. నర్సింహాచారి**

**పెద్దపల్లి ప్రతినిధి, జూన్ -11 అక్షరం న్యూస్ :** ఐటిఐ లో ప్రవేశాలకు జూన్ 14 వరకు దరఖాస్తు తేది పొడిగించనైనదని ఐటిఐ ప్రిన్సిపల్ ఏ. నర్సింహాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణా సంస్థలలో 2024-25వ విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు తేదీ ఈ నెల 14 వరకు పొడిగించడం జరిగిందని, అభ్యర్థులు ఆన్ లైన్ వెబ్ సైట్ https://iti.telangana.gov.in నందు దరఖాస్తు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ చేసిన ప్రతి అభ్యర్థి తమకు నచ్చిన ట్రేడ్లలో ఎక్కువ ఆప్షన్లను ఎంచుకోవాలని పెద్దపల్లి ప్రభుత్వ ఐ.టి.ఐ ప్రిన్సిపల్/కన్వీనర్ ఏ. నర్సింహా చారి ఆ ప్రకటనలో తెలిపారు.

## ఆన్ లైన్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించాలి

**- పెద్దపల్లి విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.సుదర్శన్**
**- రోజు రోజుకు పెరుగుతున్న ఆన్ లైన్ చెల్లింపులు**

**పెద్దపల్లి, ప్రతినిధి జూన్ -11 అక్షరం న్యూస్ :** ప్రజలు తమ విద్యుత్ బిల్లులను ఆన్ లైన్ ద్వారా సైతం చెల్లించవచ్చని పెద్దపల్లి విద్యుత్ శాఖ సపరింటెండెంట్ ఇంజనీర్ బొంకురి సుదర్శన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పెద్దపల్లి సర్కిల్ పరిధిలో ఆన్ లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు రోజురోజుకు గణనీయంగా పెరుగుతుందని, సాంకేతికతంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో అందుకు తగ్గట్టుగా వివిధ మాధ్యమాల ద్వారా ఆన్ లైన్ చెల్లింపులను టీజీఎన్పీడీసీఎల్ సులభతరం చేసిందని అన్నారు . టిజిఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్, వెబ్ సైట్ www.tgnpdcl.com, గూగుల్ పే , ఫోన్ పే , పేటియం ద్వారా నెల వారీ విద్యుత్ బిల్లులు ఆన్ లైన్ లో చెల్లింపు చేయ వచ్చుని, గంటల తరబడి లైన్ లో నిలబడి విద్యుత్ బిల్లులు చెల్లించే దాని కంటే కేవలం రెండు నిమిషాల వ్యవధిలో మీ %ఖూజ% నెంబర్ ను నమోదు చేసి చిటికెలో మీ బిల్లులు చెల్లింపు చేసుకోవచ్చు అన్నారు . మే నెలలో లి54360లి వినియోగదారులు ఆన్ లైన్ ద్వారా రూ. 8 కోట్ల 5 లక్షల 43 వేల మొత్తాన్ని చెల్లించారని, ప్రతి నెల ఆన్ లైన్ ద్వారా చెల్లింపులు 20 శాతం పెరుగుతుందని అన్నారు. విద్యుత్ బిల్లుల కేంద్రాలకు వెళ్లకుండా కేవలం ఆండ్రాయిడ్ ఫోన్ తో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చుని, తద్వారా చెల్లింపు సులభతరం అవుతుందని, కట్టిన డబ్బుల పూర్వ వివరాలు కూడా తెలుసుకోవచ్చుని, రసీదు కూడా పొందటం జరుగుతుందని అన్నారు. ఇప్పుడు కొత్తగా బిల్లు పైనే క్యూ ఆర్ కోడ్ ను ముద్రించడం జరుగుతుందని మొదట ప్రయోగాత్మకంగా (పైలట్ ప్రాజెక్ట్ ) గా వరంగల్ సర్కిల్ కేంద్రంలో మట్టెవాడ ఈఆర్ఓ పరిధిలో ప్రారంభించడం జరిగిందని, త్వరలో పెద్దపల్లి సర్కిల్ లో కూడా ప్రారంభిస్తామని అన్నారు . మీకు అందించే బిల్లుపైనే క్యూ ఆర్ ముద్రించడం జరుగుతుందని ఆ క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేయడం ద్వారా మీ బిల్లు తాలూక సంబంధించిన వివరాలు, చెల్లించ వలసిన మొత్తం కనపడుతుందని తద్వారా వినియోగదారులు అట్టి మొత్తాన్ని చెల్లించవచ్చని అన్నారు. భవిష్యత్తు మొత్తం డిజిటల్ పెమెంట్స్ ద్వారానే అన్ని కార్యకలాపాలు సాగుతుంటాయని అన్నారు. వినియోగ దారులు తమ నెలవారీ విద్యుత్ బిల్లులను ఆన్ లైన్ ద్వారా చెల్లించిగలరని సుదర్శన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కబ్జాకు గురైన గార్ల పెద్ద చెరువు...

**- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు...**
**- చెరువు కబ్జా దారులపై చర్యలు తీసుకోవాలి...**
**- గార్ల పెద్ద చెరువు ఆక్రమణపై తహసీల్దార్ కు వినతి...**
**- గుండెబోయిన నాగమణిసీతంపేట ఎంపీటీసీ, మరియు మహబూబాబాద్ జిల్లా మహిళ మోర్చ అధ్యక్షురాలు...**



**మహబూబాబాద్ /గార్ల /జూన్ 11/అక్షరం న్యూస్:** మహబూబాబాద్ జిల్లా, గార్ల మండలం పరిధిలోని గార్ల పెద్ద చెరువు గత కొంత కాలంగా కబ్జాకు గురౌతున్న పట్టించుకోక పోవడం విచారకరమని సీతంపేట ఎంపీటీసీ మరియు మహబూబాబాద్ జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు గుండెబోయిన నాగమణి అన్నారు. మహబూబాబాద్ జిల్లా, గార్ల మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో తహసీల్దార్ రవీందర్ కు డిమాడ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం గుండెబోయిన నాగమణి మాట్లాడుతూ,గార్ల పెద్ద చెరువు కింద సుమారుగా 3000 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తుందని, ఇలాంటి చెరువును కొందరు వ్యక్తులు కబ్జా చెస్తు, చెరువును పుడుస్తున్నారని , అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.చెరువు పూర్తీ స్థాయి విస్తీర్ణం సుమారుగా 600 ఎకారలు కాగా,నేడు చెరువు సుమారుగా 150 ఎకరాల వరకు కబ్జాకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు.మండల రెవిన్యూ అధికారులు ఇలాగే నిర్లక్ష్యం చేస్తే చెరువు సగం కబ్జాకు గురై చెరువు చివరి పంట పోలలకు సాగు నీరు అందక పోలాలు ఎండి పోయేశ అవకాశం ఉన్నదని అన్నారు.చెరువు కబ్జా దారులపై దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ గార్ల మండల ప్రధాన కార్యదర్శి దేవా,గార్ల మండల మహిళా మోర్చ అధ్యక్షురాలు ఆజ్మీర సుమలత,పూనెం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



**సైదాపూర్,జూన్11(అక్షరం న్యూస్):** మండలంలోని శివరాంపల్లి గ్రామంలో మంగళవారం పది క్వింటాళ్ల పిడిఎస్ రేషన్ బియ్యం, చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్ (28)అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జన్ను ఆరోగ్యం తెలిపారు.ఇక్కడ పోలీసులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం అభ్యున్నతికి పాటుపడాలి

**- జిల్లా సంఘం అధ్యక్షుడు వేముల రామ్మూర్తి**
**- ఈ నెల 23 లోపు సభ్యత్వాల సేకరణ**
**- జూలై 14 న నామినేషన్ పక్రియ**
**- జూలై 21న జిల్లా ఎన్నికలు**



**పెద్దపల్లి టౌన్ జూన్ 11 అక్షరం న్యూస్ :** పద్మశాలి సంఘం అభ్యున్నతికి ప్రతి పద్మశాలి బిడ్డ పాటుపడాలని పెద్దపెల్లి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు వేముల రామ్మూర్తి అన్నారు మంగళవారం జిల్లా కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశ కార్యక్రమంలో రామ్మూర్తి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి పలు మార్లు సమావేశాలు జిల్లా సంఘం ఎన్నికలు పెట్టి నిర్వహించాలనుకున్నప్పటికీ పలు కారణాలు సభ్యత్వ నమోదు ఆలస్యం కావడం వలన ఎన్నికలు జరగలేదని అన్నారు జిల్లా కమిటీ ఏకాభిప్రాయ మేరకు ఈనెల 23 లోపు సభ్యత్వాలు లేనివారు అన్ని మండల గ్రామాల నుండి 300 రూపాయలు చెల్లించి జిల్లా సభ్యత్వము తీసుకొని ఎన్నికలలో ఓటు హక్కుకు అర్హులు కావాలని సూచించారు జూలై 14 నుండి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తదుపరి జూలై 21న జిల్లా పద్మశాలి సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు రామ్మూర్తి తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐల రమేష్ ఉపాధ్యక్షులు సాయిరి మహేందర్ కొలిపాక సత్తయ్య కార్యనిర్వహణ కార్యదర్శి అందే సదానందం జిల్లా నాయకులు వంగ వీరస్వామి బూర్ల ధనుంజయ్ ఆడెపు చంద్రమౌళి బూర్ల సత్యనారాయణ మందల సత్యనారాయణ ఆడెపు శంకర్ మాటేటి శంకర్ మేర్గు యాదగిరి సామల రాజేంద్రప్రసాద్ పిట్టల లక్ష్మీనరసయ్య చిప్ప రాజేశం ఆడిచర్ల నంబయ్య దాసరి సాంబమూర్తి గుండ మురళి పర్శ రమేష్ చిప్ప భాస్కర్ వివిధ మండలాల అధ్యక్షులు జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులులు గోరంత తొవ్వేది కొండంత...

**- రెచ్చిపోతున్న కంకర మాఫియా...**
**- బాంబుల మోతతో ఉలిక్కిపడ్డ అర్పణపల్లి గ్రామం...**
**- క్రషర్ మిల్లుతో కష్టాలు ఇంకెన్నాళ్లు..??**
**- మూసివేయాలంటూ యువకుల డిమాండ్...**



**మహబూబాబాద్/కేసముద్రం/జూన్ 11/అక్షరం న్యూస్:** కంకర మాఫియా రోజురోజుకు రెచ్చిపోతూ బాంబుల మోతతో గ్రామాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని క్రషర్ మిల్లును వెంటనే మూసివేయాలని అర్పణపల్లి గ్రామానికి చెందిన కొంతమంది యువకులు మంగళవారం నాడు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేసముద్రం మండలం అరప్పనపల్లి గ్రామ శివారులోని సద్గురు క్రషర్ మిల్ కు అనుమతులు గోరంత తీసుకొని తమ ఇష్టానుసారంగా అనుమతులకు మించి కొండలను తవ్వేస్తున్నారని తెలిపారు.భారీ యంత్రాలతో బండలను బద్దలు కొట్టి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతులు కొంతమేర తీసుకొని కొండలను పిండి చేస్తున్న సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాత్రి పగలు తేడా లేకుండా గుట్టలను పడగొడుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు.మైనింగ్ శాఖ నుంచి అనుమతి కొంతమేర తీసుకొని అనుమతి లేని ప్రదేశంలో గుట్టలను మింగుతున్నారని వారన్నారు.క్రషర్ నిర్వాహకులు పెద్దపెద్ద బండరాళ్లను భారీ గుట్టలను తొలిచే క్రమంలో భారీ బాంబు బ్లాస్టింగ్లకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.దీంతో భయంకరమైన శబ్దాలతో గృహాలలోని పరికరాలు చెల్లాచెదరవుతూ భూకంపం వచ్చినట్లుగా ప్రజలు బిక్కు బిక్కు మంటూ బ్రతుకుతున్నారని మండిపడ్డారు.పలుమార్లు మైనింగ్ రెవెన్యూ అధికారులకు క్రషర్ మిల్లు ఆగడాలపై ఫిర్యాదులు చేసిన నిర్వాహకులు ఇచ్చే మామూళ్లకు కక్కుర్తి పడి అధికారులు చూసి చూడనట్లు వదిలేస్తున్నారని తెలిపారు.కంకర మిల్లులో అక్రమాలను వెలికి తీయాల్సిన మైనింగ్ అధికారులు మొద్దు నిద్ర నటిస్తున్నారని చెప్పారు.నిర్వాహకులు ప్రతిరోజు ఎంతమేర కంకర తయారుచేస్తున్నారు,ఎంత మేర నిల్వలున్నాయి,ఎంత మేర అమ్ముకున్నారు అని రికార్డులు పరిశీలన చేయవలసిన అధికారులు నెలల తరబడి అసలు అటువైపు కన్నెత్తి చూడడం లేదంటూ మండిపడుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సద్గురు క్రషర్ మిల్లును మూసివేసి గ్రామ ప్రజలను కాపాడాలని ఈ సందర్భంగా వారు అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంధం భరత్,అశోక్,జానీ,సతీష్, వెంకటేష్,శ్రీకాంత్,నరేష్,సంతోష్,వెంకన్న,మురళి తదితరులు పాల్గొన్నారు...

# జూన్ 20న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ**
**- నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలి**
**- 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికి మాత్రలు తప్పనిసరిగా వేయించాలి**
**- నులిపురుగుల నివారణ మందుల పంపిణీ పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సమీక్ష**



**పెద్దపల్లి ప్రతినిధి, జూన్ -11 అక్షరం న్యూస్ :** నులి పురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, జూన్ 20న జిల్లాలో ఉన్న 1-19 సంవత్సరాల వయసు లోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో నులి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. లిస్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ మాట్లాడుతూ,లి నులి పురుగులు చాలా ప్రమాదకరమని, వీటితో రక్త హీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, వీటిని నివారిస్తే ఆరోగ్యంగా వుండవచ్చునని అన్నారు. నులిపురుగుల నియంత్రణ చాలా కీలకమైన అంశమని, దీని పట్ల ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వారికి కేటాయించిన విధులను సమన్వయంతో కట్టుదిట్టంగా నిర్వహించి 1 నుంచి 19 సంవత్సరాల వయస్సులో గల పిల్లలందరికీ తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మందులు అందించాలని అన్నారు.

జూన్ 20న జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్ వాడీ కేంద్రాలలో నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు.

జిల్లాలోని 706 అంగన్ వాడి కేంద్రాలు , ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలో, జూనియర్ కళాశాలలో జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 2,27,251 మంది 1 నుండి 19 సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణి చేయాలని అన్నారు. జిల్లాలో మొత్తం 2,49,976 (10 శాతం బఫర్ స్టాక్) నులి పురుగుల నివారణ మాత్రలను అందుబాటులో ఉంచుకున్నా మని, జిల్లాలోని ఆశా వర్కర్లు, అంగన్ వాడి టీచర్లు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యా యులు, ఇతర సిబ్బంది నులి పురుగుల నివారణ కార్యక్రమంలో పాల్గొంటారని అధికారులు అదనపు కలెక్టర్ కు వివరించారు.

జూన్ 20 నాడు అనారోగ్య కారణాలు, వివిధ ఇతర కారణాల వల్ల మాత్రలు వేసుకోని విద్యార్థులకు తప్పనిసరిగా జూన్ 27 నాడు అందించాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలకు ముందస్తు సమాచారం అందించి పూర్తి స్థాయిలో విద్యార్థులు జూన్ 20న హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ప్రతి పిల్ల వాడికి తప్పనిసరిగా మాత్రలు అందే విధంగా జిల్లా విద్యాశాఖ అధికారి చర్యలు తీసుకోవాలని, పాఠశాలలకు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ నిర్వహణ, మాత్రల పంపిణీపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినంపై రూపొందించిన గోడ ప్రతులను అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే.ప్రమోద్ కుమార్,డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ. డాక్టర్ కృపా బాయ్, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, జిల్లా పంచాయతీ అధికారి ఆశా లత, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జే. రంగారెడ్డి, షెడ్యూల్ తరగతుల సంక్షేమ అధికారి నాగలేశ్వర్, మునిసిపల్ కమిషనర్లు, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రాజగోపాల్, సి.డి.పి. ఓ. కవిత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


# కేసముద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

**- ప్రమాదశాత్తు దగ్ధమైన హాస్పిటల్,మెడికల్ షాప్ యాజమాన్లాను ప్రభుత్వం ఆదుకోవాలి...**

**మహబూబాబాద్/కేసముద్రం/జూన్ 11/అక్షరం న్యూస్:** కేసముద్రం మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని సిపిఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ...కేసముద్రం మండల కేంద్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మండలమని అన్నారు.మండల కేంద్రంలో జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన వ్యవసాయ మార్కెట్ ఉన్నందున దానికి అనుసంధానంగా రైస్ మిల్లులు,ట్రేడింగ్ కంపెనీలు, మిల్లులు,బట్టల షాపులు,కిరాణం, ఎరువుల దుకాణాలతోపాటు వివిధ రకాల షాపులు ఉన్నాయని,ఇట్టి షాప్ లను నమ్ముకొని వేలాదిమంది జీవనాన్ని కొనసాగిస్తున్నారన్నారు.మండలంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడం వలన గతంలో, ప్రస్తుతం అనేక అగ్ని ప్రమాదాలు జరిగాయని దీని ద్వారా లక్షలాది రూపాయల నష్టం వాటిలిందన్నారు. గతంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కోసం స్థల పరిశీలన సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు చేపట్టి స్థలాన్ని గుర్తించినప్పటికీ నేటికీ నిర్మాణం కాకపోవడం బాధాకరమన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కోసం ప్రగల్భాలు పలికింది తప్ప ఒక్క అడుగు కూడా ముందుకేసి నిర్మాణం చేపట్టకపోవడం సిగ్గుచేటు అన్నారు.గత ప్రభుత్వ మాదిరిగా కాకుండా ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా ప్రజా అవసరాల నిమిత్తం మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మొన్న వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న హాస్పిటల్,మెడికల్ షాప్ అగ్ని ప్రమాదానికి గురైనందున బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# కబ్జా కోరల్లో వీరన్న భూములు..!





**- వీరభద్రుడి భూములకు రక్షణ కరువు**
**- దేవుడి భూమిలో అక్రమ నిర్మాణాలు..?**
**- నిద్రావస్థలో దేవాదాయ శాఖ అధికారులు**
**- భూముల సర్వే చేపట్టాలని బిజెపి పార్టీ డిమాండ్..**

**హనుమకొండ/భీమదేవరపల్లి/జూన్ 11(అక్షరం న్యూస్):** ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయ భూములు కబ్జాకు గురై అన్యక్రాంతమవుతున్నాయని బిజెపి మండల అధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ముల్కనూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయానికి 22 ఎకరాల 39 గుంటల భూమి ఉందని, దేవుని భూములు సర్వే చేపట్టకపోవడం వల్ల కాలక్రమమైన భూములు తగ్గుతూ వస్తున్నాయని స్పష్టం చేశారు. 2019లో దేవాదాయ శాఖ అధికారులు తూతూ మంత్రంగా సర్వే చేపట్టి హద్దులు నిర్ణయించలేదని అన్నారు. దీంతో దేవాలయానికి చెందిన భూములపై అక్రమార్కులు కన్ను వేసి అందిన కాడికి కబ్జా చేస్తున్నారని చెప్పుకొచ్చారు. కొత్తకొండ ఆలయ మాజీ చైర్మన్ పదవీకాలం పూర్తి అయిన మూడు రోజులకే స్థానికంగా ఉండే ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఆలయానికి చెందిన భూమిలో ప్రహరీ గోడ నిర్మాణం చేశారని, చైర్మన్ పదవి కాలం పూర్తయిన వెంటనే పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం హడావిడిగా పూర్తి చేయడం వెనక ఆంతర్యం ఏముందో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ తతంగమంతా సంబంధిత అధికారులకు తెలిసి జరుగుతుందో తెలియక జరుగుతుందో అర్థం కావడం లేదన్నారు. దేవాదాయ శాఖ అధికారులకు తెలిసిన నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆలయ సాగు భూములకు వేలం పాటలు వేసి ఆదాయం సమకూర్చుకోవడంలో ఉన్న శ్రద్ధ భూములను రక్షించడంలో లేదన్నారు. ఆలయంతో సంబంధం ఉన్నవారే భూ కబ్జాదారులకు సహకరిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ఆలయానికి చెందిన భూముల సర్వే చేపట్టి వాటికి హద్దులు నిర్ణయించాలని బిజెపి పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. లేనిచో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609